నేటి కందం- నేటికి అందం

భారత చల చిత్రములకు
తీరుగ ప్రోత్సాహమునిడ తెలగాణములో
జోరుగ బహుమతులు కళా
కారుల కందించినారు గద్దరు పేరన్ !!

(చలన చిత్ర పరిశ్రమకు ప్రోత్సాహం అందించే క్రమంలో తెలంగాణా ప్రభుత్వం గద్దర్ పేరుమీద కళాకారులకు బహుమతులు అందజేసింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

బడ్జెట్టు కేటాయింపు
బ్రహ్మాండం తలపిస్తది
అరకొరా నిధులు ఇస్తే
ఆగమవుతా విలపిస్తది
ప్రభుత్వం పొగడ్తలు
ప్రతిపక్షల విమర్శలు
అన్నీ మామూలే ఐనా
అమలైతెనే ప్రశంసలు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 22-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:173 పేజీలు:6 వెల: రూ.1/-


## నతాంజ్ అణు కేంద్రంపై దాడులు.. ఇరాన్ ఆగ్రహం..

న్యూఢిల్లీ, మార్చి 21:దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది

నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, మార్చి 21: రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్ నగర్ లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్ధనలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ప్రార్ధనలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చి ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో ప్రార్ధనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రంజాన్ మాసంలో కుల మతాలకు అతీతంగా ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బాలరాజ్, ఫాజిల్, ఖలీల్, జమీర్, గోపిలాల్ చౌహాన్, వనం శ్రీనివాస్, సమి ఉల్లా తదితరులు ఉన్నారు.

## తిరుమలను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న సీఎం చంద్రబాబు



తిరుపతి, మార్చి 21: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు , తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం దర్శించుకున్నారు. సతీమణి భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్ దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. సీఎం రాక సందర్భంగా ఆలయ మర్యాదల ప్రకారం ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం రంగనాయక మండపంలో తీర్ధప్రసాదాలు, ఆశీర్వవచనాలు అందజేశారు. మనవడు దేవాన్స్ బర్త్‌డే సందర్భంగా వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

తిరుమలలో అత్యాధునిక ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించిన సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం తిరుమలలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 50కి పైగా పరికరాలను సీఎం పరిశీలించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాండా, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ గిరిధర్ ల్యాబ్‌లోని ప్రతి పరికరం పనితీరును సీఎంకు వివరించారు. తిరుమలలోని టీటీడీ వాటర్ అండ్ ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్ భక్తులకు సురక్షితమైన నీరు, ఆహారాన్ని అందించేందుకు వివిధ వనరుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తోందని సీఎంకు వివరించారు.

## ఇరాన్ అధ్యక్షుడికి ఫోన్.. దాడులను ఖండించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 21: ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 22వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ తీవ్రంగా నష్టపోతోంది. అయినప్పటికీ వెనక్కు మాత్రం తగ్గటం లేదు. మిస్సైల్స్, డ్రోన్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాల్లో ఉన్న అమెరికా ఎయిర్ బేస్‌లపై దాడులు చేస్తోంది. ఈ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ ప్రభావం ప్రపంచ దేశాలపై పడింది. చమురు, గ్యాస్ కొరతతో ఇండియాలో కూడా సంక్షోభం నెలకొంది.

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆయనతో చర్చించారు. ఇరాన్‌లోని మౌలిక స్థావరాలపై దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. మౌలిక సదుపాయాలపై దాడులు చేయటం వల్ల ప్రాంతీయ స్థిరత్వం దెబ్బ తింటుందని, వరల్డ్ సప్లై చైన్‌కు ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. ఇరాన్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం ఆ దేశం తీసుకుంటున్న చర్యలను మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడికి ఫోన్ చేయటం ఇదే తొలిసారి కావటం గమనార్హం.

**యుద్ధం ఆపే ఆలోచనలో ట్రంప్..**

యుద్ధం కారణంగా అగ్రరాజ్యం అమెరికా అర్థికంగా భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. దీనికి తోడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు సరఫరాకు ఎదురవుతున్న ఆటంకాలు సంక్షోభం స్థాయికి చేరుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఓ కీలక పోస్ట్ పెట్టారు. అమెరికా తన లక్ష్యాలకు చేరువ అయ్యిందని, మిలటరీ చర్యలకు ముగింపు పలికే ఆలోచనలో ఉన్నామని అన్నారు.

## కేంద్రం కీలక నిర్ణయం.. కమర్షియల్ గ్యాస్ సరఫరా 20శాతం పెంపు

న్యూఢిల్లీ, మార్చి 21: కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. రాష్ట్రాలకు అదనంగా మరో 20శాతం కమర్షియల్ గ్యాస్ అందించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీ నుంచి అదనంగా 20 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఇటీవల 10శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచిందని నీరజ్ మిట్టల్ స్పష్టం చేశారు. తాజాగా మరోసారి 20 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలకు గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను సూచించారు. పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలతో నడిపించే రాయితీ క్యాంటీన్లు, అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లకు సరఫరా అయ్యేలా చూడాలని ఆయా రాష్ట్రాలకు నీరజ్ మిట్టల్ సూచించారు.

## గంజాయి సాగుదారుడిని అరెస్టు చేసిన పోలీసులు..రిమాండ్ కు తరలింపు



ఆదిలాబాద్, మార్చి 21:గంజాయి సాగు చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ ఎం.ప్రసాద్ తెలిపారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాలేపూర్ గ్రామానికి చెందిన ఎం.బాలాజీ అనే వ్యక్తి గంజాయి సాగు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీస్, రెవెన్యూ శాఖ సిబ్బందితో వ్యవసాయ క్షేత్రంపై దాడులు నిర్వహించామని వెల్లడించారు.

తనిఖీలో పంట పొలంలో 24గంజాయి మొక్కలను లభించాయని, సుమారు ఒక్కో మొక్క ఆరు అడుగుల ఎత్తు పెరిగాయని వివరించారు. వాటి విలువ రెండు లక్షల నలభై వేలు ఉంటుందని అంచనా వేశారు. బాలాజీ పై కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని శనివారం పట్టుకుని రిమాండ్ కు తరలించామన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయిస్తూ పట్టుబడినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీ సాయి, ఏఎస్సై గణపతి, కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి, కృష్ణ, స్వరాజ్ కుమార్ ఉన్నారు.

## యువకుడి దారుణం.. వేరే పెళ్లి చేసుకుందన్న కోపంతో మహిళపై కత్తితో దాడి

న్యూఢిల్లీ, మార్చి 21:హైదరాబాద్‌లోని మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది.ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు.

## దక్షిణ కొరియాలో అగ్ని ప్రమాదం.. 10 మంది మృతి.. 59 మందికి గాయాలు



న్యూఢిల్లీ, మార్చి 21: దక్షిణ కొరియాలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 10 మంది మరణించగా, 59 మంది గాయపడ్డారు. మరికొందరి ఆచూకీ తెలియడం లేదు. ఘటనకు సంబంధించి స్థానిక ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం.. డేజియోన్ పట్టణంలోని ఒక కార్ల విడిభాగాల తయారీ పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అగ్నిప్రమాదం జరిగింది.

ప్రాథమిక అంచనా ప్రకారం ఒక పేలుడు కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, అది భారీ అగ్నిప్రమాదానికి దారి తీసింది. అయితే, ఇంకా ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో 170 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు ప్రదేశంలో సోడియం వంటి పలు హానికర కెమికల్స్ ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో చాలా మంది మంటల్లో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో 10 మంది మరణించారు. 59 మంది గాయపడ్డారు. ఇంకో నలుగురి ఆచూకీ తెలియడం లేదు. వివిధ ఫ్లోర్లలో కొందరి మృతదేహాల్ని గుర్తించారు. గాయపడ్డవారిలో 25 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని అధికారులు స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా దాదాపు 500 మంది ఈ సహాయక సేవల్లో పాల్గొంటున్నారు. బాధితులకు అవసరమైన సహాయం అందించాలని లీ జే మ్యుంగ్ అధికారులను ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించిన కొన్ని దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్..

హైదరాబాద్, మార్చి 21: తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసుసంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్(ఒవ్రతిబష్ణవని వాతినిణష్ట) డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ వాఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది.

తాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు. అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.




# ప్రపంచ సమస్యగా మారనున్న మంచి నీటి ఎద్దడి !

## (22 మార్చి "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా)

జీవులకు ప్రాణాధారం జలం. భూగృహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తానే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం రూపంలో లేదా హిమానీనదాలు లేదా గ్లేసియర్స్ రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికా అందుబాటులో ఉంటున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తున్నది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు - పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ - పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది.

### హిమానీనదాల పరిరక్షణే తక్షణ కర్తవ్యం :

తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జన విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల తగు అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నదని గమనించిన ఐరాస ప్రతి ఏట 22 మార్చిన "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణ కేంద్రంగా నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2026 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా "వాటర్ అండ్ జెండర్ - నీటి ప్రవాహంతో లింగ సమానత్వం" అనబడే అంశం కేంద్రంగా అవగాహన కలిపించడం జరుగుతున్నది.

### అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం:

హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్పియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025-34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్పియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు - పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది.

### హిమానీనదాలను రక్షించుకునే మార్గాలు:

భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గీగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర ?ట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి.

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదిక "సహజ వనరుల కొరత" ఆధారంగా విడుదల చేయబడింది. రానున్న రోజుల్లో అతి ముఖ్యమైన కొరత ప్రమాదాల్లో 4వ స్థానం నీటి ఒత్తిడి గుర్తించబడింది.

నీరు తాగడానికి, పారిశుద్ధ్యానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత కాపాడడంలో కూడా ఉపయోగపడుతుంది. ప్రపంచ నీటి దినం వేదికగా నీటి వనరులను కాపాడడంతో పాటు హిమానీనదాల వేగవంతమైన కరగడాన్ని కూడా తగ్గించడానికి ప్రజలకు పలు మార్గాల్లో ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సింది ఉన్నది. సహజ వనరైన నీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నీటిని ఆదా చేస్తూ, హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బృందావన్‌లోని రామకృష్ణ సేవాశ్రమ్‌లో నంద కిశోర్ సోమనీ ఆంకాలజీ బ్లాకును ప్రారంభించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 21:ఉత్తరప్రదేశ్‌లోని వృందావన్‌లో ఉన్న రామకృష్ణ మిషన్ సేవాశ్రమ్‌లో నంద కిశోర్ సోమనీ ఆంకాలజీ బ్లాకును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రోజు (2026 మార్చి, 20) ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక చైతన్యం, మానవతా సేవల సంగమానికి శక్తిమంతమైన చిహ్నంగా రామకృష్ణ మిషన్ నిలుస్తుందని అన్నారు. రామకృష్ణ పరమహంస అద్వితీయమైన భక్తి నుంచి ఓ గొప్ప శక్తి వెలువడింది. దానిని ఆయన శిష్యుల్లో అగ్రగణ్యులైన స్వామి వివేకానంద మానవ సంక్షేమం కోసం ఒక వ్యవస్థగా మలిచారు. భగవంతున్ని చేరుకొనేందుకు ప్రేమ, సేవ, కరుణలే అత్యుత్తమ మార్గాలనే సందేశాన్ని రామకృష్ణ మిషన్ ఎల్లప్పుడూ చెబుతుంది. నిస్వార్థ సేవ, కరుణే ఆధ్యాత్మికతకు నిజమైన వ్యక్తీకరణలు అని ఈ సంస్థ నిరూపించింది.

అత్యంత తీవ్రమైన అనారోగ్యాల్లో క్యాన్సర్ ఒకటి అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించడం, నాణ్యమైన చికిత్సను అందించడమే రోగి ప్రాణాలను కాపాడటంలో నిర్ణయాత్మకంగా మారతాయి. అయితే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక కుటుంబాలకు ఈ వ్యాధికి చికిత్స తీసుకోవడం కష్టంగా లేదా అసాధ్యంగా కూడా అనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో సేవా దృక్పథంతో పని చేసే సంస్థలు సమాజ సంక్షేమంలో చురుకైన పాత్రను పోషిస్తాయి. అవగాహన కార్యక్రమాలు, సకాలంలో స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నివారణ, ప్రారంభ దశలోనే చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఆరోగ్యవంతులైన పౌరుల ద్వారానే బలమైన, స్వావలంబన సాధించిన భారత్ కల సాకారమవుతుంది.

ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ప్రతి పౌరునికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు భారత్ నిరంతరాయంగా కృషి చేస్తోందని రాష్ట్రపతి అన్నారు. ఆయుష్మాన్ భారత్ లాంటి చరిత్రాత్మక పథకాల ద్వారా, లక్షలాది మంది పౌరులకు తక్కువ ధరలకే నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. క్యాన్సర్ చికిత్సను కూడా ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి తీసుకురావడం వల్ల పేద, నిరుపేద రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

సేవా దృక్పథంతో పనిచేసే వైద్య సంస్థలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి అన్నారు. అవి కేవలం వ్యాధులకు చికిత్స చేయడమే కాకుండా, రోగులు, వారి కుటుంబ సభ్యుల జీవితాల్లో ఆశను, ఆత్మవిశ్వాసాన్ని, గౌరవాన్ని నింపుతాయని ఆమె పేర్కొన్నారు. ఆధునిక వైజ్ఞానిక శాస్త్రం, మానవతా దృక్పథం కలిస్తే మానవ సంక్షేమం కోసం అనేక గొప్ప కార్యాలు చేయవచ్చని రామకృష్ణ మిషన్ నిరూపించిందని ఆమె తెలిపారు. రామకృష్ణ మిషన్ సేవాశ్రమంతో కలసి పనిచేస్తున్న వారందరినీ ఆమె అభినందించారు. రాబోయే కాలంలో ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో వారి కృషి కీలకంగా మారుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# రూ.6969.04 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూపుదిద్దుకోనున్న వినియోగ నియంత్రిత రహదారి

న్యూఢిల్లీ, మార్చి 21:ఉత్తరప్రదేశ్‌లో బారాబంకి -బహ్రాయిచ్ మధ్య (101.515 కి.మీ.) 4 వరుసల వినియోగ నియంత్రిత జాతీయ రహదారి-927 నిర్మాణానికి ఇవాళ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. మొత్తం రూ.6969.04 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ విధానం కింద ఈ రహదారి పనులను చేపడతారు.

ఇది రాష్ట్రంలోని జాతీయ రహదారి-927' పరిధిలోని బారాబంకి-బహ్రాయిచ్ విభాగం ఉన్నతీకరణకు ఉద్దేశించిన ప్రాజెక్టు. ఈ రెండు జిల్లాల్లోని వివిధ జనసమ్మర్ద ప్రాంతాల్లో ప్రస్తుతం ఎదురవుతున్న తీవ్ర కోణీయ లోపాలు, పదునైన మలుపులు, రద్దీ వంటి సమస్య లన్నీ ఈ మార్గం నిర్మాణంతో పరిష్కృతం అవుతాయి. అడుగడు గునా సర్వీస్ రోడ్లతో కూడిన ఈ వినియోగ నియంత్రిత 4 వరుసల రహదారి ప్రధాన నివాస ప్రాం తాల మీదుగా వెళ్తూనే, సగటు ప్రయాణ వేగాన్ని పెంచగలదు.

అంతేకాకుండా ప్రయాణ సమయాన్ని దాదాపు గంట వరకూ తగ్గిస్తూ- మొత్తం రహదారి భద్రత, ఇంధన సామర్థ్యం, వాహన నిర్వహణ వ్యయాన్ని మెరుగుపరుస్తుంది. తద్వారా ప్రాంతీయ రవాణా సహా సామాజిక-ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది.రహదారి విభాగం ఉన్నతీకరణతో ఉత్తరప్రదేశ్‌లోని కీలక ఆర్థిక, సామాజిక, రవాణా కేంద్రాలకు నిరంతర అనుసంధానం కలుగుతుంది. అంతేకాకుండా 3 ఆర్థిక, 2 సామాజిక, 12 రవాణా కేంద్రాలను జోడించడం ద్వారా బహుళ రవాణా అనుసంధానాన్ని ఈ నవీకృత కారిడార్ మెరుగుపరుస్తుంది.

ఇది రూపైదిహా భూమార్గ ఓడరేవు, విమానాశ్రయాలతో మెరుగైన బహుళ రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ, ఈ ప్రాంతమంతటా వస్తు, ప్రయాణిక సత్వర రవాణా సౌలభ్యం కల్పిస్తుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తితో నేపాల్‌గంజ్ సరిహద్దు ద్వారా భారత్-నేపాల్ మధ్య కీలకమైన సరిహద్దు వాణిజ్య-రవాణా వ్యూహాత్మక కారిడార్ ఏర్పాటవుతుంది. రూపైదిహా భూమార్గ ఓడరేవుకు సౌలభ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. బహ్రాయిచ్, శ్రావస్తి వంటి మారుమూల జిల్లాలకు అనుసంధానం కూడా దీనితో మెరుగవుతుంది. ఈ ప్రాజెక్టుతో పీఎం గతిశక్తి కార్యక్రమ ంతో పాటు ఆర్థిక, రవాణా కేంద్రాలకు మద్దతు లభిస్తుంది. వ్యవసాయ వాణిజ్యం, పర్యాటకం, సరిహద్దు వాణిజ్యం, ప్రాంతీయ పెట్టుబడులను కూడా ఇది ప్రోత్సహిస్తుంది.

# పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

**-దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న**
**-మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి**

అమరావతి, మార్చి 21:ఉరవకొండ నియోజకవర్గంలోని అంకంపల్లి, దుద్దేకుంట, గంగవరం గ్రామాలలో అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర నష్టపోయారు. దీనితో ఉరవకొండ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త వై, విశ్వేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు కలిసి శనివారం అంకంపల్లి, దుద్దేకుంట, గంగవరం గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఎంత నష్టం వాటిల్లింది.

అన్న విషయాన్ని ఆయా గ్రామాల రైతులతో కలిసి వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో, పంట నష్టపోతే దాదాపు 7, 500 కోట్లు ఇన్సూరెన్స్ రైతులకు కేటాయించిన ఘనత వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పంటలు దెబ్బతిని లక్షలాది రూపాయలు రైతులు నష్టపోయారన్నారు.రైతులు ఇంత నష్టపోయిన కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న, బెలుగుప్ప మండలంతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలో ఎంత అయితే నష్టం వాటిలిందో, ప్రభుత్వం సర్వే చేసి, ప్రతి ఒక్క రైతుకు న్యాయం చేసి , తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు

**-ఎ.కొండూరు మార్కెట్ యార్డులో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు**
**-నిరుద్యోగ యువతకు వరం**
**-ఎ.కొండూరు మార్కెట్ యార్డ్ గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశా**

అమరావతి, మార్చి 21:ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టిందని,ఇందులో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ ఎ.కొండూరు మండలం చైతన్య నగర్ సమీపంలో ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ( ఏఎంసి మార్కెట్ యార్డ్)ను సందర్శించి గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకుని, త్వరలోనే ఒక భారీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (నైపుణ్యాభివృద్ధి కేంద్రం) ప్రారంభించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న గోడౌన్లు శిక్షణ తరగతులు నిర్వహించడానికి, ల్యాబ్‌ల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గోడౌన్ల ప్రస్తుత పరిస్థితిని, మౌలిక సదుపాయాలను కలెక్టర్ సమీక్షించారు. యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే తిరువూరు పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది యువతకు నైపుణ్య శిక్షణ లభించి, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, తహసీల్దార్ ఎన్. అరవింద్, గిరిజన రాష్ట్ర నాయకులు బి. గోపి రాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న లలిత్ సాగర్

అమరావతి, మార్చి 21:దర్శి పట్టణం కురిచేడు రోడ్ లోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ పురస్కరించుకొని వేలాదిగా ముస్లింలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లలిత్ సాగర్ కు ముస్లిం సోదరులు సాదరంగా స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

# జీజీహెచ్‌లో కలెక్టర్ లక్ష్మీశ తనిఖీలు

**-వైద్యసేవలతో పాటు యూత్ టైం బ్యాంకు సేవల పరిశీలన**



విజయవాడ, మార్చి 21: జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ శనివారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌ను సందర్శించి ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలను ఈరోజు పరిశీలించారు. ఈరోజు యూత్ టైం బ్యాంక్ సేవల్లో భాగంగా నలంద డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ 31 మంది వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించారు.

ఆసుపత్రిలోని ఓపీడీ కౌంటర్, క్యాజువాలిటీ వార్డు, ఫార్మసీ, ఎక్స్‌రే, జనరల్ సర్జికల్ ఓపీ, ఆర్థో ఓపీ, న్యూరో వార్డ్, మెయిన్ బ్లాక్, డా. ఎన్టీఆర్ వైద్యసేవ తదితర ప్రాంతాల్లో టైం బ్యాంక్ వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా సేవలు అందించగా కలెక్టర్ లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు. యూత్ టైం బ్యాంక్ మొబైల్ యాప్‌ను పరిశీలించి వాలంటీర్, రోగి వివరాలు టైం బ్యాంకులో నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టారు.

ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములు అయిన వాలంటీర్లను కలెక్టర్ లక్ష్మీశ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డా. కొల్లేటి రమేష్, సూపరింటెండెంట్ డా. ఏడుకొండలు, నలంద కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సుబ్బారావు, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ కనకరాజు, ఆసుపత్రి అధికారులు, వాసవ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ తీరాన అంతర్జాతీయ స్థాయి ఆతిథ్యం..

**-హయత్ హోటల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి కందుల దుర్గేష్,శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు**
**-రూ. 250 కోట్ల పెట్టుబడితో 3 ఎకరాల విస్తీర్ణంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం.. రెండేళ్లలో పూర్తికి చర్యలు**



విశాఖపట్నం, మార్చి 21: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ పటంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో విశాఖపట్నంలోని సాగర్ నగర్-ఎండాడ సమీపంలో (సన్ ఇంటర్నేషనల్ స్కూల్ వెనుక) పీవీఆర్ గ్రూప్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'హయత్' ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్థానిక శాసనస భ్యులు గంటా శ్రీనివాసరావు శని వారం భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ఫలితంగా కుదిరిన ఎంవోయూలు నేడు కార్యరూపం దాల్చుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. దాదాపు రూ. 250 కోట్ల భారీ పెట్టుబడితో 3 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ హోటల్ నిర్మితమవుతోందని, రెండేళ్ల కాలపరిమితిలో ఇది అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం 'గ్లోబల్ సిటీ'గా ఎదుగుతున్న తరుణంలో, ఈ నూతన హోటల్ పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలవనుందని పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్, రాడిసన్ బ్లూ వంటి అగ్రశ్రేణి హోటళ్ల సరసన పీవీఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో రానున్న ఈ హయత్ హోటల్ ప్రపంచ స్థాయి విలాసవంతమైన వసతులను కల్పిస్తుందని వెల్లడించారు.

జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ సమావేశాలు, ప్రోత్సాహక కార్యక్రమాలు , సదస్సులు నిర్వహించుకోవడానికి అత్యున్నత సాంకేతికతతో కూడిన కాన్ఫరెన్స్ హాళ్లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయన్నారు. విశాఖకు వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అభిరుచులకు తగ్గట్టుగా లోకల్ మరియు గ్లోబల్ వంటకాలతో కూడిన ఫైన్ డైనింగ్ అనుభూతిని ఈ హోటల్ అందించనుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఆతిథ్య రంగంలో భారీగా ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి లభించనుందని స్పష్టం చేశారు. విశాఖకు స్టార్ హోటళ్ల రాక వల్ల నగర ముఖచిత్రాన్ని మారుతుందన్నారు.

# భారత్ విద్యుత్ సదస్సు - 2026: భారత ఇంధన భవితను రూపుదిద్దే దిశగా ఒకే వేదికపైకి విధాన నిర్ణేతలు, పారిశ్రామికాధినేతలు

న్యూఢిల్లీ, మార్చి 21:ఇంధన, విద్యుత్ రంగానికి సంబంధించి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రపంచ స్థాయి సదస్సు, ప్రదర్శన అయిన భారత్ విద్యుత్ - 2026ను మార్చి 19 నుంచి 22 వరకు న్యూఢిల్లీలోని యశోభూమిలో నిర్వహించనున్నారు.

ఈ సదస్సులో 100కు పైగా ఉన్నత స్థాయి సమావేశాలు, 300కు పైగా వక్తలు, 80కి పైగా దేశాల ప్రతినిధులు, 100 అంకుర సంస్థలు సహా మొత్తం 500కు పైగా ప్రదర్శనకారులు, 25,000 మందికి పైగా సందర్శకులు పాల్గొంటారని అంచనా. విద్యుత్ రంగానికి సంబంధించి ఇది ప్రపంచంలో అతిపెద్ద వేదికల్లో ఒకటిగా ఇది నిలవనుంది.

'విద్యుదీకరణతో వృద్ధి.. సాధికారికంగా సుస్థిరత.. ప్రపంచంతో అనుసంధానం..' అన్న ఇతివృత్తంతో నిర్వహించనున్న ఈ సదస్సులో వ్యూహాత్మక సమావేశాలు, సాంకేతిక సదస్సులు, పారిశ్రామికాధినేతల బృందాల చర్చలు, పరిశ్రమల మధ్య పరస్పర చర్చల వంటి ఉన్నత స్థాయి సమావేశాలతో కూడిన సమగ్ర కార్యక్రమాలుంటాయి. అంతర్జాతీయంగా విద్యుత్ రంగంలో వృద్ధిని పెంపొందిస్తూ, దాన్ని మరింత తీర్చిదిద్దుతూ ముందుకు తీసుకెళ్లడమే వీటి లక్ష్యం.

వివిధ దేశాలకు చెందిన ఇంధన శాఖ మంత్రులు, భారతీయ రాష్ట్రాల మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత స్థాయి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కాబోతున్నారు. విద్యుత్, శుద్ధ ఇంధన రంగంలో చర్చలకూ, సహకారానికీ, ఆవిష్కరణలకూ అంతర్జాతీయంగా ముఖ్యమైన వేదికల్లో ఒకటిగా ఈ సదస్సు నిలుస్తుందని.. ఇంతటి భారీ స్థాయిలో ప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా స్పష్టమవుతోంది.

సదస్సులో ప్రసంగించబోయే ముఖ్య వక్తల్లో కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి శ్రీ మనోహర్ లాల్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార - ప్రజా పంపిణీ శాఖ, నూతన - పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, విద్యుత్, నూతన - పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద నాయక్, కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీ పంకజ్ అగర్వాల్, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ) చైర్మన్ శ్రీ ఘనశ్యామ్ ప్రసాద్ ఉన్నారు. వీరితోపాటు 10 దేశాల ఇంధన శాఖ మంత్రులు, దేశంలోని 25కు పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యుత్ శాఖ మంత్రులు, కార్యదర్శులు, 60 దేశాల ప్రతినిధులు, అన్ని కేంద్ర విద్యుత్ రంగ సంస్థల అధిపతులు సహా వందకు పైగా సీఈవోలు సదస్సులో భాగస్వాములు కాబోతున్నారు.

ఈ విధంగా దేశంలో మారుతున్న విద్యుత్ వ్యవస్థను ప్రభావితం చేసే కీలక అంశాలపై చర్చించడానికి.. ఉన్నత స్థాయి విధానకర్తలు, నియంత్రణాధికారులు, విద్యావేత్తలు, ఈ రంగంలో నిపుణులు, విద్యుత్ సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, పరిశ్రమల అధినేతలను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురాబోతోంది.

మేక్ ఇన్ ఇండియా కింద సరఫరాదారుల అభివృద్ధిపై ఈ సదస్సు ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ముఖ్యంగా కాలుష్య నియంత్రణ వ్యవస్థలు, సౌరశక్తి, ఇంధన నిల్వ, విద్యుత్ ప్రసార మౌలిక సదుపాయాలు, పంపిణీకి సంబంధించి డిజిటల్ సాంకేతికతల్లో దేశీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది. 2032 నాటికి విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ, ఇంధన నిల్వ రంగాల్లో రూ. 50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి అవకాశాలున్నట్టు అంచనా. ఈ నేపథ్యంలో దేశ విద్యుత్ రంగంలో ఆవిష్కరణలనూ, పోటీతత్వాన్నీ పెంపొందించడం, ఈ రంగంలో ఉత్తేజం నింపడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం.

వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విద్యుత్ రంగంపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆసక్తిని.. 80కి పైగా దేశాల ప్రతినిధుల భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. అలాగే అవాంతరాలను తట్టుకుని నిలిచేలా, అందుబాటు ధరలో లభించేలా, పర్యావరణ హిత పద్ధతుల వైపు ఇంధన పరివర్తనను సాధ్యం చేసే దిశగా- భారత్ స్థాయి పెరుగుతోందని ఇది చాటుతోంది.

అంతర్జాతీయ ప్రతినిధులతోపాటు దేశంలోని 25కు పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉన్నత స్థాయి నేతలు, అధికారులు కూడా ఈ సదస్సులో భాగస్వాములు కాబోతున్నట్టు ధ్రువీకరించారు. హర్యానా (వ్యూహాత్మక రాష్ట్ర భాగస్వామి), రాజస్థాన్ (భాగస్వామి రాష్ట్రం), ఉత్తరప్రదేశ్ (వ్యూహాత్మక రాష్ట్ర భాగస్వామి), మహారాష్ట్ర (వ్యూహాత్మక రాష్ట్ర భాగస్వామి), ఆంధ్రప్రదేశ్ (ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్రం), బీహార్ (ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్రం), ఒడిశా (ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్రం), గుజరాత్ (వ్యూహాత్మక రాష్ట్ర భాగస్వామి), పంజాబ్ (భాగస్వామి రాష్ట్రం), మధ్యప్రదేశ్ (భాగస్వామి రాష్ట్రం), ఛత్తీస్ గఢ్ (భాగస్వామి రాష్ట్రం), ఢిల్లీ (ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్రం) రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ సదస్సులో ప్రత్యేక భాగస్వామ్యం లభించనుంది. దేశ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని వేగవంతం చేయడం, గ్రిడ్ మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి కీలక అంశాలపై చర్చలను సానుకూలం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం కీలకమవుతుందని భావిస్తున్నారు.

ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలిచే 20,000 చదరపు మీటర్ల భారీ ప్రదర్శనలో విద్యుత్ రంగంలోని అన్ని దశలకూ చెందిన అత్యాధునిక సాంకేతిక తలను, ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనను విద్యుదుత్పత్తి, ప్రసారం, పునరుత్పాదక, శుద్ధ ఇంధనం, ఇంధన నిల్వ, పంపిణీ, స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతల వంటి వివిధ నేపథ్య విభాగాలుగా విభజించారు. వీటితోపాటు ఇంధన ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, అధునాతన సాంకేతికతల కోసం ప్రత్యేక ప్రదర్శనలుంటాయి. విద్యుదుత్పత్తి సాంకేతికతలు, ప్రసార వ్యవస్థలు, నియంత్రణ మార్గాలు, డిజిటల్ సాంకేతికతలు, బ్యాటరీ ఆవిష్కరణలు, ఇంధన సామర్థ్య మార్గాల ప్రదర్శన కోసం.. పరిశ్రమల అధినేతలు, ఆవిష్కర్తలు, తయారీదారులకు ఈ విభాగాలు ఒక గొప్ప వేదికగా ఉపయోగపడతాయి.

ఈ సదస్సులో భాగంగా పరిశ్రమల మధ్య సహకారాన్ని, ప్రభావవంతమైన చర్చలను పెంపొందించడం కోసం వరుసగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతర్జాతీయ మంత్రిత్వ స్థాయి సమావేశం, జాతీయ విద్యుత్ మంత్రిత్వ స్థాయి సమావేశం, విద్యుదుత్పత్తి - ప్రసారం - పంపిణీ విభాగాల సీఈవోల ఫోరమ్‌లు ఇందులో భాగంగా ఉంటాయి. అలాగే ఈ రంగంలోని ప్రముఖ సంస్థల సీఈవోలతో (హిటాచీ - యూఎస్ఏ, రొసెట్టి - రష్యా, ఎస్కోమ్, టీఎన్‌బీ - మలేషియా, ఆఫ్రికా50, ఈడీఎఫ్ పవర్ సొల్యూషన్స్, జెస్కో కంపెనీల సీఈవోలు సహా) రంగాల వారీ సమగ్ర చర్చా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. అంతేకాకుండా స్థిర ఇంధన నిల్వ, ప్రసార రంగంలో ఇండస్ట్రీ 4.0 సాంకేతికతలు, జల విద్యుత్ అభివృద్ధి, కార్బన్ మార్కెట్లు, చట్టపరమైన, నియంత్రణ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా వ్యవస్థలో సరఫరాదారుల అభివృద్ధి అవకాశాల వంటి కీలక పారిశ్రామిక ప్రాధాన్యాలపై ఇతివృత్తాల వారీగా ఈ సదస్సులో సమావేశాలను నిర్వహిస్తారు. ఇంధన రంగంలో అంకుర సంస్థలు, నవతరం సాంకేతికతలు, యువ నిపుణులు, విద్యుత్ రంగ నాయకత్వ స్థానంలో మహిళలను ప్రోత్సహించే కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తారు.

ఆఫ్రికా సెషన్, బ్రిటిష్ హై కమిషన్, ప్రముఖ అంతర్జాతీయ ఇంధన సంఘాలు సహా అంతర్జాతీయ సహకార వేదికలకు ఈ సదస్సులో మరింత ప్రాధాన్యముంటుంది. వీటితోపాటు కేబుల్‌టెక్-2026 వంటి ప్రత్యేక పారిశ్రామిక చర్చలు, వికేంద్రీకృత పునరుత్పాదక ఇంధనం కోసం వినియోగదారుడి ప్రాంగణంలోనే ఏర్పాటు చేసుకునే ఇంధన నిల్వ వ్యవస్థలపై చర్చలు ఉంటాయి. విద్యుత్ రంగ భవితను నిర్దేశించే సరికొత్త సాంకేతికతలు, పెట్టుబడి అవకాశాలను అన్వేషించేలా.. భారత ఇంధన నిల్వ కూటమి (ఐఈఎస్ఏ) వంటి సంస్థల నేతృత్వంలో సమావేశాలు కూడా జరుగుతాయి.

ప్రపంచ విద్యుత్ వ్యవస్థ భవిష్యత్తుకు కీలకమైన అంశాలపై ఈ సదస్సులో జరిగే వ్యూహాత్మక చర్చలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. 120 మందికి పైగా ప్రముఖ నాయకులు, కీలక నిర్ణేతలు ప్యానెల్ చర్చల్లో పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా పరస్పరానుసంధాన విద్యుత్ వ్యవస్థల బలోపేతం, ఇంధన పరివర్తనలో ప్రపంచవ్యాప్తంగా భారత అగ్రగణ్యతను ముందుకు తీసుకెళ్లడం, పటిష్టమైన విద్యుత్ సరఫరా వ్యవస్థల నిర్మాణం వంటివి ఇందులో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు విద్యుత్ రంగంలో కొత్త పెట్టుబడులకు దారులు వెతకడం, శుద్ధ ఇంధన సాంకేతికతల వినియోగాన్ని వేగవంతం చేయడం, విద్యుత్ రంగానికి సంబంధించి ప్రతీ దశలోనూ అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంపైనా ఇందులో చర్చలు నిర్వహిస్తారు.

విద్యుత్ రంగంలో సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరిచే మార్గాలపై కూడా ఈ సదస్సులో చర్చిస్తారు. ఇంధన లభ్యతలో సమ్మిళితత్వాన్ని విస్తరించడం, అలాగే వేగంగా మారుతున్న ఈ రంగానికి అవసరమైన అధునాతన నైపుణ్యం కలిగిన సిబ్బందిని తీర్చిదిద్దడంపై కూడా ఈ సమావేశాలు ప్రత్యేకంగా దృష్టి సారిస్తాయి.

ప్రభుత్వాధినేతలు, ప్రాజెక్టు యజమానులు, ఈపీసీ కంపెనీలు, మౌలిక సదుపాయాల నిర్మాణ సంస్థలు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, సాంకేతిక - ఇంజనీరింగ్ నిపుణులు, ఆర్థిక సంస్థలు, ఎంఎస్ఎంఈలు, భారీ తయారీదారులు, పరిశ్రమల సంఘాలు, విద్యావేత్తలు సహా.. ప్రపంచవ్యాప్త వివిధ వర్గాలకు చెందిన వీక్షకుల దృష్టిని ఈ కార్యక్రమం ఆకర్షిస్తుందని భావిస్తున్నారు. ఈ సదస్సులో భాగంగా కొనుగోలుదారు ? విక్రేతల సమావేశాలను కూడా నిర్వహిస్తారు. అంతర్జాతీయ కొనుగోలు సంస్థలు, విద్యుత్ సంస్థలు, మౌలిక సదుపాయాల నిర్మాణ సంస్థలు.. భారతీయ తయారీదారులు, సాంకేతిక నిపుణులతో నేరుగా చర్చించేందుకు ఇవి వీలు కల్పిస్తాయి.

ఇంధన భద్రత, సుస్థిరతలతోపాటు అంతర్జాతీయ స్థాయిలో ముందువరుసలో నిలవాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ? పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంతోపాటు.. ప్రపంచ విద్యుత్ వ్యవస్థలో భారత్ పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సదస్సు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని భావిస్తున్నారు.

# ఒకేసారి 3 నెలల రేషన్ పంపిణీ!

అమరావతి, మార్చి 21:పేద ప్రజలకు ఉపశమనం కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ పంపిణీ విధానంలో మార్పులు చేసి లబ్ధిదారులకు సౌలభ్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రాలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రజలు తరచూ రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు.

ఈ విధానంతో లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడే బియ్యం, గోధుమలు వంటి ధాన్యాలను ఒకేసారి అందజేయనున్నారు. దీంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పంపిణీ ప్రక్రియలో కూడా సౌలభ్యం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

# వేయిస్తంభాల గుడిలో వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు



హన్మకొండ, మార్చి 20: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు చెరుకుపల్లి శ్రీవాత్సవచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించి ఊంజల్ సేవ నిర్వహించారు.

శ్రీ భద్రాద్రి రామునిగా ఉత్సవమూర్తులను అలంకరించి నిరాజనం మంత్రపుష్పములు సమర్పించారు. యాగశాలలో విశ్వక్సేన నవగ్రహ, తెల్లనువ్వులు, నవధాన్యాలతో వివిధ రకాల ఫల పుష్పాలతో మహాసు దర్శన యాగం, లోకకళ్యాణార్థం భక్తుల కు సుదర్శన హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో తమిళనాడు ఆర్ఎస్ఎస్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ అడ్వకేట్ శ్రీధర్‌మూర్తి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఎస్.ముఖేష్, తిరుమూర్తి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రామేశ్వరరావు, వందలాది మంది భక్తులు సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.అనిల కుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీరామ సేవా సమితి ట్రస్టు సభ్యుడు కట్ల రాజు పాల్గొన్నారు.

# గిరిజన భారత్ హృదయసీమలోకి స్వాగతం: న్యూఢిల్లీలో 'భారత్ ట్రైబ్స్ ఫెస్ట్-2026' ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 21:దేశంలోని గిరిజనుల సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, హస్తకళలు, వ్యవస్థాపన స్ఫూర్తిని చాటే జాతీయ వేదికగా న్యూఢిల్లీలోని సుందర్ నర్సరీలో 'భారత్ ట్రైబ్స్ ఫెస్ట్ -2026' నేడు ప్రారంభమైంది. 'ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ట్రైఫెడ్) సహకారంతో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది.

కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి శ్రీ జువల్ ఓరం ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వియత్నాం రివ బ్లిక్ 'జాతులు-తెగల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ డావో గోక్ డాంగ్, సహాయ మంత్రి శ్రీ వై.థా ఒంగ్ పాల్గొన్నారు. అలాగే గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి రంజనా చోప్రా, అదనపు కార్యదర్శి శ్రీ మనీష్ ఠాకూర్, సంయుక్త కార్యదర్శి శ్రీ అనంత్ ప్రకాష్ పాండే, ట్రైఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎం.రాజము రుగన్, మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు, గిరిజన నాయకులు, చేతివృత్తులవారు, ఇతర భాగస్వాములు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహా రాల శాఖ మంత్రి శ్రీ జువల్ ఓరం మాటాడుతూ- "దేశంలోని గిరిజనుల సుసంపన్న సంప్రదాయాలు, సృజనాత్మకత, పునరుత్థాన సామర్థ్యాలను 'భారత్ ట్రైబ్స్ ఫెస్ట్' ప్రతిబింబిస్తుంది. గిరిజన కళాకారులు, వ్యాపార వేత్తలకు మార్కెట్ అనుసంధాన బలోపేతం సహా గిరిజన కళలు, చేతివృత్తులు, చేనేత, వంటకాలు, వ్యాపారం తదితర వైభవాన్ని చాటిచెప్పడంలో ఈ ఉత్సవం ఓ కీలక జాతీయ వేదికగా ఉపయోగపడుతుంది" అన్నారు.

వియత్నాం సోషలిస్ట్ రిపబ్లిక్ జాతులు- తెగల వ్యవహారాల శాఖ మంత్రి గౌరవనీయ డావో గోక్ డాంగ్ మాట్లాడుతూ- భారత్, వియత్నాం మధ్య చిరకాల భాగస్వామ్యం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే "మా సాంస్కృతిక, ఆర్థిక, జాతుల పరమైన సంబంధాల్లో పాదుకున్న బలమైన, బహుముఖ బంధాన్ని భారత్‌తో పంచుకోవడం మాకెంతో ఆనందాన్నిస్తోంది. నేడు రెండు దేశాల మధ్య స్నేహసంబంధాల 10వ వార్షికోత్సవం మనం నిర్వహిం చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో మన బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటూ శాశ్వత స్నేహం స్థాయికి చేర్చే దిశగా అవగాహన పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి రంజనా చోప్రా ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరిస్తూ- "గిరిజన హస్తకళలు, అపార వ్యవస్థాపన సామర్థ్యాన్ని ఈ భారత్ ట్రైబ్స్ ఫెస్ట్ ప్రస్ఫుటం చేస్తుంది. అలాగే, సంప్రదాయ జ్ఞాన వ్యవస్థలు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రోత్సాహం లభించేందుకు ఇది తోడ్పడుతుంది. గిరిజన కళాకారులు భవిష్యత్తులో తమ ఉత్పత్తులను సాధికారికంగా విక్రయించుకుంటూ మెరుగైన లాభాలు ఆర్జించడంతోపాటు అర్థవంతమైన గుర్తింపు పొందగలుగుతారు. తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా మార్కెట్‌లో వారి మనుగడ మరింత బలోపేతం అవుతుందని మేం దృఢంగా విశ్వసిస్తున్నాం'' అని ఆవె పేర్కొన్నారు. దేశం నలుమూలలాగల గిరిజన తెగలను, సంస్థలను ఈ ఉత్సవం ఒకే వేదికపైకి తెచ్చింది. హస్తకళలు, చేనేత వస్త్రాలు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ గిరిజన వంటకాల ఉత్సాహభరిత, విశేషానుభూతిని ఈ ప్రదర్శన మన సొంతం చేస్తుంది.ప్రసిద్ధ డిజైనర్లు, గిరిజన కళాకారులు సంయుక్తంగా రూపొందించిన, ప్రత్యేకంగా ఎంపిక చేసిన గిరిజన వస్త్రాలు-హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించే విశిష్ట పెవిలియన్ ప్రారంభంతోపాటు 'రిసా' బ్రాండ్‌ను ఆవిష్కరించడం ఈ ఉత్సవంలో ఒక ప్రధాన ఆకర్షణ గా పేర్కొనవచ్చు. కేంద్ర మహిళా -శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్, శ్రీమతి రంజనా చోప్రా, శ్రీ ఎం. రాజమురుగన్, గిరిజన వ్యవహా రాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అనంత్ ప్రకాష్ పాండే, ప్రముఖ డిజైనర్ శ్రీ మనీష్ త్రిపాఠి తదితర ప్రముఖుల సమక్షంలో మంత్రి శ్రీ జువల్ ఓరం 'రిసా'బ్రాండ్‌ను ఆవిష్కరించారు. అస్సాంలోని ప్రసిద్ధ 'ఏరి సిల్క్, మూగా సిల్క్', ఒడిషా రాష్ట్ర 'కోట్‌పాడ్ కాటన్', లద్దాఖ్ ప్రాంత 'చాంగ్‌పా పష్మీనా', తమిళనాడు రాష్ట్ర 'తోడా ఎంబ్రాయిడరీ' వంటి దేశీయ వస్త్ర సంప్రదాయాలను సమకాలీన డిజైన్లలో 'రిసా' వేదికపై ప్రదర్శిస్తున్నారు.

0గిరిజన కళాకారులు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ, విస్తృత మార్కెట్‌తో సంధానితులు కావడంలో ఈ వేదిక కొత్త అవకాశాలు కల్పిస్తుంది.

ఈ ఉత్సవంలో భాగంగా సహకారం, ఆవిష్కరణలు, మార్కెట్ విస్తరణ మార్గాల అన్వేషణ తదితరాల దిశగా విధాన రూపకర్తలు, పరిశ్రమ అగ్రగాములు, డిజైనర్లు, గిరిజన సంస్థల ప్రతినిధులతో పలు రోజుల పాటు నిర్వహించే 'భారత్ ట్రైబ్స్ బిజినెస్ కాంక్లేవ్' 19వ తేదీ నుంచి ప్రారంభమైంది.

దీంతోపాటు 24వ తేదీన 'సీఎస్ఆర్' సదస్సును నిర్వహించనున్నారు. సుస్థిర జీవనోపాధికి ప్రోత్సాహం సహా కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా కార్పొరేట్-గిరిజన సంస్థల మధ్య భాగస్వామ్యాల బలోపేతంపై ఇది దృష్టి సారిస్తుంది.

న్యూఢిల్లీలోని సుందర్ నర్సరీలో ఈ నెల 18న ప్రారంభమైన 'భారత్ ట్రైబ్స్ ఫెస్ట్-2026' ఈ నెల 30వ తేదీవరకూ కొనసాగుతుంది. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వచ్చిన గిరిజనుల కళలు, చేనేత, హస్తకళలు, వంటకాలు, సాంస్కృతిక ప్రదర్శనల సంపూర్ణ అనుభూతిని సందర్శకులు ఆస్వాదించవచ్చు. గిరిజనానికి మెరుగైన జీవనోపాధి అవకాశాల కల్పనతోపాటు తమ వారసత్వంపై వారిలో అవగాహనను మరింత పెంచి, ప్రోత్సహించడం ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యం.

# పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

## -దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి



అమరావతి, మార్చి 21: ఉరవకొండ నియోజకవర్గంలోని అంకంపల్లి, దుద్దేకుంట, గంగవరం గ్రామాలలో అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర నష్టపోయారు. దీనితో ఉరవకొండ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త వై, విశ్వేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు కలిసి శనివారం అంకంపల్లి, దుద్దేకుంట, గంగవరం గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఎంత నష్టం వాటిల్లింది.

అన్న విషయాన్ని ఆయా గ్రామాల రైతులతో కలిసి వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో, పంట నష్టపోతే దాదాపు 7, 500 కోట్లు ఇన్సూరెన్స్ రైతులకు కేటాయించిన ఘనత వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పంటలు దెబ్బతిని లక్షలాది రూపాయలు రైతులు నష్టపోయారన్నారు.

రైతులు ఇంత నష్టపోయిన కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న, బెలుగుప్ప మండలంతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలో ఎంత అయితే నష్టం వాటిలిందో, ప్రభుత్వం సర్వే చేసి, ప్రతి ఒక్క రైతుకు న్యాయం చేసి , తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ప్రకటనల్లో అవగాహన, సమ్మతిని ప్రోత్సహించడానికి యాడ్‌ట్రస్ట్ సమ్మిట్-2026లో యాడ్ లా కంపెండియం ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 21:ముంబయిలో ఈ రోజు జరిగిన యాడ్‌ట్రస్ట్ సమ్మిట్-2026లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ... "ప్రకటనలు కేవలం విస్తృతిని పెంచడమే కాకుండా, విశ్వాసాన్నీ పెంపొందించాలి" అని వ్యాఖ్యానించారు. దేశంలో బాధ్యతాయుతమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన ప్రకటనల వ్యవస్థ ఆవశ్యకతను ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈ రంగం పరిమాణంలో, సంక్లిష్టతలో, ప్రభావంలో ముందుకు దూసుకెళ్తున్న తరుణంలో ఇది మరింత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ముఖ్యంగా డిజిటల్ రంగంలో జవాబుదారీతనం ఎంతో అవసరమని శ్రీ జాజు ఉద్ఘాటించారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విధానం విశ్వాసాన్ని పెంపొందించడం, వృద్ధికి మద్దతునివ్వడం, బాధ్యతను నిర్ధారించడంపైనే దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు.

అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) నిర్వహించిన యాడ్‌ట్రస్ట్ సమ్మిట్-2026 మొదటి సంచిక... బాధ్యతాయుతమైన ప్రకటనలకు సంబంధించిన కీలక సమస్యలపై చర్చించడానికి ప్రకటనలు, మీడియా, టెక్నాలజీ, ప్రభుత్వ రంగాల ప్రతినిధులను ఒకచోట చేర్చింది. ఈ చర్చలు అభివృద్ధి చెందుతున్న పోకడలు, చట్టపరమైన నిబంధనలు, ప్రకటనల పద్ధతులపై ఆధునిక సాంకేతికతల ప్రభావంపై ప్రధానంగా దృష్టి సారించాయి.

సదస్సులో శ్రీ జాజు మాట్లాడుతూ... ప్రకటనలు కేవలం ఒక వాణిజ్య కార్యక్రమం మాత్రమే కాదనీ, అవి మార్కెట్లను తీర్చిదిద్దుతాయని, బ్రాండ్‌లను నిర్మిస్తాయని, వినియోగదారులకు సమాచారం అందిస్తాయని, సంస్కృతిని సూచిస్తాయని, ఆకాంక్షలను ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. భారత్ వంటి పెద్ద, వేగంగా డిజిటలైజ్ అవుతున్న దేశంలో ఆవిష్కరణలు, ఆర్థిక కార్యకలాపాలు, కంటెంట్ సృష్టి, సమ్మిళితత్వానికి ప్రకటనలు ఒక కీలక చోదక శక్తిగా మారాయన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, కృత్రిమ మేధ ఇప్పుడు బ్రాండ్‌లు, అంకురసంస్థలు, స్థానిక వ్యాపారాలు, సృష్టికర్తలు పెద్ద ఎత్తున వినియోగదారులను చేరుకోవడానికి వీలు కల్పిస్తున్నాయనీ... తద్వారా ప్రవేశ అవరోధాలను తగ్గించి, భాగస్వామ్యాన్నీ విస్తరిస్తున్నాయని శ్రీ జాజు వ్యాఖ్యానించారు.

బలహీన వర్గాలను తరచుగా లక్ష్యంగా చేసుకునే చేసే ఆర్థిక మోసాలు, తప్పుదోవ పట్టించే పెట్టుబడి ప్రచారాలు, మోసపూరిత ఉద్యోగ ఆఫర్లు వంటి డిజిటల్ ప్రకటనలతో ముడిపడి ఉన్న ప్రమాదాలనూ ప్రస్తావించిన శ్రీ జాజు... ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

వాణిజ్య ప్రసంగం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమే అయిన ప్పటికీ... తప్పుదోవ పట్టించే, మోసపూరిత ప్రకటనలను నియంత్రించవచ్చునీ, నియంత్రిం చాలనీ ఆయన పేర్కొన్నారు.

ప్రకటనల్లో ఏఐ పాత్ర, డీప్‌ఫేక్‌లు, డార్క్ ప్యాటర్న్‌లు, పెరుగుతున్న యాంటీ-ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ధోరణి వంటి కొత్తగా తలెత్తుతున్న సమస్యలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరిగాయి.

ప్రకటన కర్తలు రీచ్‌తో పాటు విశ్వసనీయతపైనా దృష్టి పెట్టాలనీ... క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రామాణికతను పాటిస్తూ, తప్పుదోవ పట్టించే ప్రమోషన్లకు దూరంగా ఉంటూ ప్రేక్షకుల నమ్మకాన్ని కాపాడుకోవాలని శ్రీ జాజు కోరారు.

ఆహ్వానం
కవిసంధ్య కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ
యానాం - హైదరాబాద్
భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
సంయుక్త నిర్వహణలో
ప్రపంచ కవితా దినోత్సవం -2026
22 మార్చి 2026 ఆదివారం, సా. 5.30కి రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలు
కవిసంధ్య - సుధామ కవితల పోటీ బహుమతుల ప్రదానం
తెలుగులో యుద్ధ కవిత్వం పై ప్రత్యేక ప్రసంగం
కవిసంధ్య-59 - చందు సుబ్బారావు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
ముఖ్య అతిథి: శ్రీ కె. శివారెడ్డి, సరస్వతి సమ్మాన్ అవార్డు గ్రహీత
గౌరవ అతిథి: శ్రీ జింబో (మంగారి రాజేందర్) జిల్లా జడ్జి, రిటైర్డ్
సభాధ్యక్షులు: డా.శిఖామణి, కవిసంధ్య సంపాదకులు
విశిష్ట అతిథి-కవిసంధ్య-59, చందు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ:
డా.ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
బహుమతుల సౌజన్యం: శ్రీ సుధామ, ప్రముఖ కవి, రేడియో ప్రయోక్త
కవితల పోటీ నివేదిక: కళారత్న దాట్ల దేవదానం రాజు, పోటీల కన్వీనర్
ప్రత్యేక ప్రసంగం: ఆచార్య కోయి కోటేశ్వరరావు, ప్రముఖ కవి, విమర్శకులు
అంశం: తెలుగులో యుద్ధ కవిత్వం
ఆత్మీయ అతిథులు:
శ్రీ సన్నిధానం నరసింహ శర్మ, ప్రముఖ సాహితీవేత్త
శ్రీమతి శీలా సుభద్రా దేవి, ప్రముఖ కవయిత్రి
శ్రీ యార్లగడ్డ రాఘవేంద్ర రావు, ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్
శ్రీ సి.ఎస్.రాంబాబు, ప్రముఖ కవి రేడియో ప్రయోక్త
డా.జి.వి.రత్నాకర్, ప్రముఖ కవి, మౌలానా అజాద్ కేంద్రీయ ఉర్దూ యూనివర్సిటీ.
శ్రీ పి.శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ కవి, అనువాదకుడు
ఆహ్వానం: శ్రీ చల్లా రామఫణి, ప్రముఖ కవి
సభాసమన్వయం: శ్రీ అరిగెల రాజు, కవిసంధ్య హైదరాబాద్ కన్వీనర్
దాట్ల దేవదానం రాజు
కన్వీనర్, పురస్కార కమిటీ, 9440105978
శిఖామణి
అధ్యక్షులు, కవిసంధ్య, 9848202526

# పీఎన్‌జీ పరివర్తన దిశగా సంస్కరణలు చేపట్టే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా 10 శాతం వాణిజ్య ఎల్‌పీజీ కేటాయిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 21:పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై ఈ రోజు జాతీయ మీడియా కేంద్రంలో పెట్రోలియం- సహజ వాయువు, ఓడరేవులు- నౌకాయానం- జలమార్గాలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు మీడియాకు వివరాలు తెలియజేశారు. మారుతున్న పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ఇటువంటి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నేటి సమావేశంలో ఇంధన లభ్యత, నౌకాయాన కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయులకు అందిస్తున్న సహాయంపై తాజా సమాచారాన్ని పంచుకున్నారు.

**ఇంధన సరఫరా, లభ్యత**

హార్ముజ్ జలసంధి మూసివేత నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూసేందుకు తీసుకుంటున్న చర్యలపై పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ తాజా సమాచారాన్ని అందించింది. ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ ఈ విధంగా పేర్కొంది:

**ముడి చమురు, చమురు శుద్ధి కేంద్రాలు**

అన్ని రిఫైనరీలు తగినంత ముడి చమురు నిల్వలతో గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ఉత్పత్తి తగినంతగా ఉంది. దేశీయ అవసరాలను తీర్చడానికి ఎటువంటి దిగుమతులు అవసరం లేదు.

చమురు శుద్ధి కేంద్రాల నుంచి దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తి సుమారు 40 శాతం పెరిగింది.

**రిటైల్ అవుట్‌లెట్లు**

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రకారం రిటైల్ అవుట్‌లెట్లలో ఎటువంటి ఇంధన కొరత నమోదు కాలేదు. పెట్రోల్, డీజిల్ సరఫరా క్రమం తప్పకుండా కొనసాగుతోంది.

తగినంత స్టాక్ అందుబాటులో ఉన్నందున ప్రజలు భయాందోళనతో నిల్వ చేయొద్దని సూచించారు.

సహజ వాయువు

గృహ వినియోగ పీఎన్‌జీ, సీఎన్‌జీ రవాణాకు 100 శాతం సరఫరాతో సహా ప్రాధాన్యత రంగాలకు రక్షిత గ్యాస్ సరఫరా కొనసాగుతోంది. అదే సమయంలో పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు సరఫరాను సుమారు 80 శాతానికి నియంత్రించారు.

వాణిజ్య ఎల్‌పీజీ వినియోగదారులు పీఎన్‌జీకి మారాలని ప్రోత్సహిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, హాస్టళ్లు వంటి సంస్థలు అధీకృత సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) సంస్థల నుంచి పీఎన్‌జీ కనెక్షన్‌లను పొందొచ్చు.

ఐజీఎల్, ఎంజీఎల్, గెయిల్ గ్యాస్, బీపీసీఎల్ వంటి సీజీడీ కంపెనీలు గృహ, వాణిజ్య పీఎన్‌జీ కనెక్షన్‌లను ప్రోత్సహించడానికి రాయితీలను అందిస్తున్నాయి.

స్వచ్ఛ, సమర్థవంతమైన పీఎన్‌జీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం సీజీడీ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది. వ్యాపార సంస్థలు కనెక్షన్‌ల కోసం అధీకృత సీజీడీ సంస్థలను సంప్రదించాల్సిందిగా కోరారు.

విత్తనాల ఆరబెట్టే యూనిట్లు, శీతల నిల్వ కేంద్రాలు వంటి కీలక రంగాలకు గరిష్ట గ్యాస్ సరఫరా జరిగేలా చూడాలని సీజీడీ సంస్థలకు సూచించారు.

గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయం నుంచి సరఫరా ప్రారంభమయ్యే వరకు పట్టే కాలాన్ని తగ్గించాలని.. అలాగే వినియోగదారులు పీఎన్‌జీని ఎంచుకునేలా ప్రోత్సహించడానికి ఆ గడువును వారికి స్పష్టంగా తెలియజేయాలని పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) సీజీడీ సంస్థలను ఆదేశించింది.

పీఎన్‌జీ డ్రైవ్ కింద ముద్రణ, రేడియో, సామాజిక మాధ్యమాలు, భాగస్వాములు, ఇన్‌ఫ్లుయెన్సర్లతో కూడిన ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సీజీడీ సంస్థలకు సూచించారు.

2026 మార్చి 16 నాటి లేఖ ద్వారా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు తక్షణ అనుమతులు (డీమ్డ్ పర్మిషన్) ఇవ్వడం, కొత్త అనుమతులను 24 గంటల్లోపు ఆమోదించడం, రోడ్ల పునరుద్ధరణ- అనుమతి రుసుములను మినహాయించడం, పని వేళలు- సీజన్లలో సడలింపులు ఇవ్వడం, సమన్వయం కోసం రాష్ట్ర నోడల్ అధికారులను నియమించడం ద్వారా సీజీడీ విస్తరణకు సహకరించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం కోరింది.

2026 మార్చి 18 నాటి లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం.. ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి మారడానికి మద్దతుగా చేపట్టిన సంస్కరణల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా 10 శాతం వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును ప్రతిపాదించింది.

సీజీడీ దరఖాస్తుల ఆమోదం, ఫిర్యాదుల పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు చేసినందుకు 1 శాతం అదనపు కేటాయింపు

సీజీడీకి తక్షణ అనుమతులు (డీమ్డ్ పర్మిషన్స్) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు 2 శాతం అదనపు కేటాయింపు

సీజీడీ సంస్థల కోసం 'డిగ్ అండ్ రిస్టోర్ స్కీమ్' ప్రవేశపెట్టినందుకు 3 శాతం అదనపు కేటాయింపు

వార్షిక అద్దె, లీజు రుసుములను తగ్గించినందుకు 4 శాతం అదనపు కేటాయింపు ఉంటాయి.

సీజీడీ నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేయడానికి.. గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు పీఎన్‌జీ కనెక్షన్‌లను త్వరితగతిన అందించడానికి ఈ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ప్రోత్సహిస్తున్నారు.

ఈ చర్యలు ఎల్‌పీజీ డిమాండ్‌పై ఒత్తిడిని తగ్గిస్తాయని, వాణిజ్య వినియోగదారులు పీఎన్‌జీ వైపు సులభంగా మారడానికి దోహదపడతాయని భావిస్తున్నారు.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఎల్‌పీజీ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఎక్కడా ఎల్‌పీజీ కొరత ఉన్నట్లు నివేదికలు అందలేదు.

ఆన్‌లైన్ ఎల్‌పీజీ బుకింగ్‌లు 83 శాతం నుంచి 93 శాతానికి పెరిగాయి.

గ్యాస్ పక్కదారి పట్టకుండా నిరోధించడానికి 'డెలివరీ అథెంటికేషన్ కోడ్' కవరేజీని ఫిబ్రవరి 2026 నాటి 53 శాతం నుంచి సుమారు 81 శాతానికి పెంచారు.

గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మణిపూర్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సహా సుమారు 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు గృహేతర ఎల్‌పీజీ కేటాయింపు కోసం ఉత్తర్వులు జారీ చేశాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా అందుబాటులో ఉంది.

**కిరోసిన్**

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా 48,000 కిలో లీటర్ల (కేఎల్) కిరోసిన్ కేటాయించారు. పంపిణీ కేంద్రాలను గుర్తించాలని ఆయా రాష్ట్రాలను కోరారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, కేరళ, మణిపూర్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలతో కలిపి సుమారు 12 రాష్ట్రాలు కిరోసిన్ (ఎస్‌కేఓ) కేటాయింపు ఉత్తర్వులను జారీ చేశాయి. కొన్ని రాష్ట్రాలు తమకు ఎటువంటి అవసరం లేదని తెలియజేశాయి.

**రాష్ట్ర ప్రభుత్వాల సమావేశాలు**

నిత్యావసరాల అక్రమ నిల్వలు, నల్లబజారు క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 'నిత్యావసర సరకుల చట్టం', 'ఎల్‌పీజీ నియంత్రణ ఉత్తర్వుల' కింద నిత్యావసర వస్తువుల సరఫరాను పర్యవేక్షిస్తున్నాయి.

అక్రమ పద్ధతులను అరికట్టడానికి సమన్వయంతో కూడిన తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

ఇప్పటికే 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశాయి. 22 రాష్ట్రాలు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశాయి. మిగిలిన వారు ప్రాధాన్యత ప్రతిపాదికన వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజస్థాన్, తెలంగాణ, గోవా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు మొదలైన 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశాయి.

ఇంతవరకు కంట్రోల్ రూంలు, జిల్లా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ అత్యవసర ప్రతిపాదికన వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

**అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలు**

ఎల్‌పీజీ అక్రమ నిల్వలు, నల్లబజారు క్రయవిక్రయాలను అరికట్టడానికి అన్ని రాష్ట్రాల్లో నిఘా చర్యలు కొనసాగుతున్నాయి.

ఇటీవలి కాలంలో జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో పెద్ద ఎత్తున ఎల్‌పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నాయి.

సరఫరా సజావుగా సాగేలా చూడటానికి, అక్రమాలను నిరోధించడానికి రిటైల్ అవుట్‌లెట్లు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్‌షిప్‌ల వద్ద 2,300 కంటే ఎక్కువ ఆకస్మిక తనిఖీలను ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (పీఎస్‌యూ ఓఎంసీలు) నిర్వహించాయి.

**ప్రభుత్వం చేపడుతున్న ఇతర చర్యలు**

ముఖ్యంగా గృహాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి ప్రాధాన్య రంగాలకు నిరంతరాయ ఎల్‌పీజీ సరఫరా, పీఎన్‌జీ విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యాన్ని కొనసాగిస్తోంది.

సరఫరా, డిమాండ్-సైడ్ చర్యల్లో భాగంగా రిఫైనరీ ఉత్పత్తిని పెంచడం, పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు... గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వరకు బుకింగ్ వ్యవధులను సవరించడం, ప్రాధాన్యతా క్రమంలో కేటాయింపులు చేయడం వంటివి చర్యలను అమలు చేస్తోంది.

ఎల్‌పీజీ డిమాండ్‌పై ఒత్తిడిని తగ్గించడానికి కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థల వినియోగాన్ని మెరుగుపరచడం ద్వారా డిజిటల్ బుకింగ్‌లను ప్రోత్సహిస్తూ, ఆందోళనతో చేసే బుకింగ్‌లను నివారించేందుకు కృషి చేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు రాష్ట్రాల్లో వాణిజ్య ఎల్‌పీజీ సరఫరానూ ప్రారంభించారు. పౌరులు అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని, వదంతులకు దూరంగా ఉండాలని సూచించారు.

వినియోగదారులు భయాందోళనలతో బుకింగ్‌లు చేయకూడదని, డిజిటల్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించుకోవాలని, ఎల్‌పీజీ పంపిణీదారులను అనవసరంగా సంప్రదించవద్దని విజ్ఞప్తి చేయడమైనది.

పౌరులు పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను, ఎలక్ట్రిక్, ఇండక్షన్ కుక్‌టాప్‌లను ఉపయోగించాలని... ఇంధనాన్ని పొదుపు చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

**నౌకా వాణిజ్య భద్రత, నౌకాయాన కార్యకలాపాలు**

పర్షియన్ గల్ఫ్‌లో ప్రస్తుత నౌకా వాణిజ్య పరిస్థితి, భారతీయ నౌకలు, సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి తీసుకుంటున్న చర్యల గురించి నౌకాశ్రయాలు, నౌకాయానం, జల రవాణా మంత్రిత్వ శాఖ వివరణాత్మక తాజా సమాచారాన్ని పంచుకుంది.

# కోటమైసమ్మ దేవాలయంలో ఏకాదశ రుద్రాభిషేక పూజలు



కారేపల్లి, మార్చి 21 : ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ దేవాలయంలో అమ్మవారి పవిత్ర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొత్తలంక కైలాస శర్మ ఆధ్వర్యంలో కొత్తగూడెంనకు చెందిన కృష్ణ యజుర్వేద పండితులు బ్రహ్మశ్రీ కొడమంచిలి పణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతకాల మండప పూజలు, అమ్మవారికి నవ కలశ స్థపనము, జల బిందెల అభిషేకము, మహిళల సామూహిక కుంకుమార్చన, వేద పారాయణ,మహా విద్యా పారాయణ, పవిత్రంగా హోమములు, శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, శ్రీ మహా త్రిపుర సుందరి బ్రహ్మవిద్య మంత్ర హోమం వంటి పూజలు జరిపారు.

మణుగూరుకు చెందిన సామాజికవేత్త జక్కుల రామకోటేశ్వరరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జక్కుల శంకర్‌రావు, జక్కుల వెంకటగిరి, కృష్ణారావు బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలలో కోటమైసమ్మ ఆలయ ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, కార్యనిర్వాహణాధికారి కె.వేణుగోపాలచార్యులు, దేవాదాయ శాఖ అధికారులు పగడాల మోహన్ కృష్ణ, పర్స సాయి, అన్న ప్రసాద కార్యక్రమ నిర్వహణ కన్వీనర్ తాటిపల్లి సుబ్బారావు, ఏలుగురు మధు బాబు, సైఫా రాజశేఖర్, గందె సురేశ్, చందా చక్రధర్, నూక ఆనందరావు, అర్వపల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

# గొర్రెల మంద పైకి దూసుకెళ్లిన కారు.. 10 జీవాలు మృతి

కరీంనగర్, మార్చి 21: మేత కోసం వెళ్తున్న గొర్రెల పైకి కారు దూసుకు వెళ్లడంతో పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఒకరికి స్వలగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో శనివారం కాట్నపల్లి వైపు వెళుతున్న గొర్రెల మందపైకి పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు దూసుకెళ్లి పంట పొలాల్లో నిలిచిపోయింది.

ఈ ప్రమాదంలో పది గొర్రెలు మృతిచెందగా , గొర్రెల మేత కోసం తీసుకు వెళ్తున్న శాస్త్రి నగర్‌కు చెందిన రాజుకు గాయాలయ్యాయి. అతడిని వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మరో ఆరు గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు వివరించారు.

# వేరొకరిని పెళ్లి చేసుకుందని మహిళపై వంటవాడి దాడి

హైదరాబాద్, మార్చి 21: తనను కాదని వేరే వ్యక్తిని వివాహం చేసుకుందన్న కోపంతో ఓ మహిళపై ప్రియుడు, అతని తండ్రి కలిసి కత్తితో దాడి చేశారు. ఈ సంఘటన

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకినాడకు చెందిన నూకరత్నం(25)అనే మహిళ మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటూ హౌస్ కీపింగ్ పనిచేస్తుంది. గతంలోనే భర్తను కోల్పోయిన నూకరత్నానికి ఇద్దరు కూతుళ్లున్నారు.

కొంత కాలం క్రితం ప్రసాద్ అనే వ్యక్తితో నూకరత్నంకు పరిచయం ఏర్పడింది. ఇద్దరు పరస్పర అంగీకారంతో గత నెల ఫిబ్రవరి 20న వారు వివాహం చేసుకున్నారు. ఆలీషా అలియాస్ పాండు అనే వ్యక్తి నూకరత్నం పని చేసే చోటే వంట వాడిగా పనిచేస్తున్నాడు. అయితే నూకరత్నంను ఇష్టపడ్డ ఆలీషా అలియాస్ పాండుకు ఆమె తనకు చెప్పకుండా ప్రసాద్‌ను పెళ్లిచేసుకోవడంతో కక్ష పెంచుకున్నాడు.

ఈ క్రమంలో ఆలీషా ఈ నెల 19వ తన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌తో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. తనతో రావాలని నూకరత్నంతో అలీషా గొడవ పడగా.. అందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆలీషా తన వెంట తెచ్చుకున్న కత్తితో నూకరత్నంపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాధితురాలిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. నూకరత్నంపై దాడికి పాల్పడ్డ నిందితులు ఆలీషా, అతని తండ్రి లాలూను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# సమాజంలో చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలు అందాలి

**-నిర్మల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్**



నిర్మల్, మార్చి 21: సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలు అందించాలి అని బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్ రావులు, రామనాథ్, మరియు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు.

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమంలో భాగంగా శనివారం కడెం మండలంలోని కొండుకూరు గ్రామంలో ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల శిక్షణ తరగతులు నిర్వహించబడ్డాయి. ఈ తరగతుల్లో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ప్రసంగించారు.

రితేష్ రాథోడ్ మాట్లాడుతూ, సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో సాన్నిహిత్యం వంటి అంశాలపై సమగ్ర మార్గనిర్దేశం అందించడం ముఖ్యమని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం ఈ శిక్షణకు ప్రధాన ఉద్దేశ్యం అని స్పష్టం చేశారు.

ఆ కార్యక్రమంలో భవిష్యత్ రాజకీయ, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేలా కార్యకర్తలను తీర్చిదిద్దుతూ సమర్థవంతమైన నాయకత్వాన్ని రూపొందించేందుకు ఈ కార్యక్రమం ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు, అంత్యోదయ సూత్రం మరియు సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా పార్టీ కార్యకర్తలు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉన్నదని వివరించారు. కార్యకర్తలకు సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం, ప్రజలతో సాన్నిహిత్యం వంటి అంశాలపై మార్గనిర్దేశం చేయబడింది.

ఈ శిక్షణ కార్యక్రమంలో వక్తలుగా బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్ రావులు, రామనాథ్, మేడిశెమ్మే రాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు మాదిరే శ్రీనివాస్ బుర్ర, రమేష్, కొండేరి రమేష్, అంకం మహేందర్, కొంతం శంకరయ్య, బిజెపి మండలాల అధ్యక్షులు కాశి, వేణి, శ్రీనివాస్ యాదవ్, మధుసూదన్ రావు, ఐదు వెంకటేష్, పుప్పాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

**-ఆటో, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు, రూ.3 వేల నగదు స్వాధీనం**

**-వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి**



నల్గొండ, మార్చి 21:నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దేవాలయ హుండీల దొంగతనం, అలాగే ఆటో, స్కూటీ, సెల్ ఫోన్లు అపహరించే వ్యక్తిని నల్లగొండ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి స్కూటీ, ఆటో, రెండు సెల్‌ఫోన్లు, దొంగతనాలకు ఉపయోగించే రాడ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టూటౌన్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు ఆయన వెల్లడించారు. ఈ నెల 19న ఉగాది పండుగ రోజున రామగిరికి చెందిన మాతంగి సాయినాథ్ అయ్యప్ప గుడిలో హుండీ, తన స్కూటీ మరియు రెండు సెల్ ఫోన్లు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశాడు. అదే రోజు వైకుంఠనగర్‌లో ఒక ఆటో, ఆర్టీసీ కాలనీలోని శ్రీకృష్ణ ఆలయంలో హుండీ దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో నల్లగొండ టూటౌన్ పోలీసులు సవాల్ గా తీసుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

శనివారం ఉదయం సావర్కర్ నగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఒక వ్యక్తి ఆటోలో దేవుడి హుండీ తీసుకుని అనుమానస్పదంగా వెళ్తుంటే పట్టుకోవడంతో పొంతన లేని లేని సమాదానాలు చెప్పాడు. వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిందితుడిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాలానగర్‌లోని చింతల్ ప్రాంత పరిధిలోని భగత్‌నగర్‌కు చెందిన పోలిశెట్టి కార్తీక్ కుమార స్వామి ఏ కార్తీక్ ఏ కార్తీక్ కుమార్ ఏ కుమార స్వామి పాత నేరస్తుడిగా గుర్తించాం. విచారణ చేయగా తానే అపహరించినట్లు తెలిపాడు. ఇతడిపై నల్లగొండ వన్ టౌన్, టూ టౌన్, సంగారెడ్డి, జీడిమెట్ల, ఖమ్మం, మహబూబాబాద్, గుంటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో ఇండ్లు, దేవాలయాల్లో దొంగతనాలకు సంబంధించిన 10కి పైగా కేసులు నమోదైనట్లు వెల్లడించారు. మూడు సార్లు జైలుకి వెళ్లి ఏడాదిన్నర శిక్ష అనుభవించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవ రావు, టూ టౌన్ ఎస్ఐ వై.సైదులు, సిబ్బంది అహ్మద్ షరీఫ్, సాగర్ల శంకర్, బాలకోటి, సట్టు సతీశ్, ఫరూక్, సతీశ్, ప్రదీప్, హోంగార్డ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# 2030 నాటికి 100 శాతం స్థూల నమోదు నిష్పత్తిని సాధించేందుకు ఎన్ఐఓఎస్ ద్వారా సార్వత్రిక విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న డీఓఎస్ఈఎల్

న్యూఢిల్లీ, మార్చి 21:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షించిన వికసిత్ భారత్ 2047 దార్శనికతను సాకారం చేసేందుకు, ఆత్మనిర్భర్ భారత్ ఆశయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం (డీఓఎస్ఈఎల్) కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా పాఠశాలలకు వెళ్లని పిల్లలను, మధ్యలోనే చదువు మానేసిన వారిని గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు భారీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

రాబోయే 2030 నాటికి ప్రీ-స్కూల్ స్థాయి నుంచి మాధ్యమిక స్థాయి వరకు 100 శాతం స్థూల నమోదు నిష్పత్తిని సాధించడమే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 లక్ష్యంగా పెట్టుకుంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 వార్షిక నివేదిక ప్రకారం.. 14-18 ఏళ్ల మధ్య వయస్సు గల దాదాపు 2 కోట్ల మంది పిల్లలు పాఠశాలలకు వెళ్లడం లేదని తేలింది. 3 నుంచి 8 తరగతుల మధ్య సుమారు 11 శాతం మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నట్లు వెల్లడైంది. అలాగే ప్రతి ఏటా 50 లక్షల కంటే ఎక్కువ మంది విద్యార్థులు బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు.

100 శాతం నమోదు లక్ష్యాన్ని సాధించాలంటే ఈ పిల్లలను వీలైనంత త్వరగా తిరిగి విద్యా వ్యవస్థలోకి తీసుకురావడం, భవిష్యత్తులో చదువు మధ్యలోనే మానేయడాన్ని నివారించడం అత్యవసరం. ఆర్థిక, సామాజిక, భౌగోళిక ఇబ్బందుల కారణంగా రోజూ పాఠశాలలకు వెళ్లలేని పిల్లలకు ఓపెన్ స్కూలింగ్ (సార్వత్రిక విద్య) ఒక మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన జాతీయ సార్వత్రిక విద్య సంస్థ.. దూర విద్యా విధానం ద్వారా నాణ్యమైన పాఠశాల విద్యను, నైపుణ్యాభివృద్ధిని అందిస్తోంది. ఇది అందరికీ సమానమైన విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, సార్వత్రిక విద్యా లక్ష్యాలను ప్రోత్సహిస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద సార్వత్రిక విద్య సంస్థగా పేరొందిన ఎన్ఐఓఎస్.. సులభమైన ప్రవేశ ప్రక్రియ, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి బహుళ అవకాశాలు, విద్యార్థి కోరుకున్నప్పుడు పరీక్ష రాసే సౌకర్యం, ఉపాధికి అవసరమైన వృత్తి విద్యా కోర్సులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు, ఇతర జాతీయ, రాష్ట్ర బోర్డులతో సమానమైన గుర్తింపు ఉన్న ధ్రువీకరణ పత్రాన్ని అందించడం వంటి సౌకర్యాలను కల్పిస్తుంది.

జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం పాఠశాల్లో విద్యార్థుల నమోదును, వారి అభ్యాస స్థాయిలను నిరంతరం పర్యవేక్షించడం చాలా ముఖ్యం.

దీనివల్ల విద్యార్థులు పాఠశాలల్లో కొనసాగుతున్నారా లేదా అని తెలుసుకోవడంతో పాటు, చదువు మధ్యలో ఆపేసిన వారిని తిరిగి విద్యా వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు సరైన అవకాశాలు కల్పించవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకారంతో బడి బయట ఉన్న లేదా చదువు మానేసిన పిల్లలను సంప్రదించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించనుంది. సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయడానికి, చదువు మానేసిన పిల్లల భవిష్యత్తును మెరుగుపరచడానికి, దేశవ్యాప్తంగా విశ్వసనీయమైన సార్వత్రిక విద్య వ్యవస్థ ద్వారా ఎన్ఐఓఎస్ అధికారులు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిసి పనిచేయనున్నారు.

# ఈటీ టెలికామ్ 5జి సమ్మిట్‌లో భారత వేగవంతమైన 5జి , 6.జి విస్తరణ-డాక్టర్ పెమ్మసాని




న్యూఢిల్లీ, మార్చి 21:టెలికామ్ రంగంలో భారతదేశం అద్భుతమైన పురోగతిని సాధించిందని, 5జిలో, రాబోయే 6జి సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా ఎదిగేందుకు భారత్ ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో ముందుకు సాగుతోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.న్యూఢిల్లీలో జరిగిన ఈటీ టెలికామ్ 5ఉ సమ్మిట్‌లో పాల్గొని , ప్రసంగించిన ఆయన.. 2031 నాటికి దేశంలో 5ఉ వినియోగదారుల సంఖ్య 100 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. ఈ సరికొత్త తరం కనెక్టివిటీ దేశవ్యాప్తంగా ఉన్న పౌరులకు మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన అవకాశాలను కల్పిస్తుందని, ఇది సమాజంలో పెద్ద మార్పుకు దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ వేగవంతమైన పురోగతి విధాన సంస్కరణలు, బలమైన నాయకత్వం వల్ల సాధ్యమైందన్నారు. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ పునర్నిర్వచనం, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల తొలగింపు మరియు బ్యాంక్ గ్యారెంటీల క్రమబద్ధీకరణ వంటి కీలక చర్యలు టెలికామ్ సేవా సంస్థల ఆర్థిక మరియు నిర్వహణ వాతావరణాన్ని గణనీయంగా మెరుగుపరిచాయని ఆయన తెలిపారు. దీనివల్ల 5ఉ మౌలిక సదుపాయాలలో భారీ పెట్టుబడులు పెట్టడం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

టెలికామ్ రంగం మొత్తాన్ని ముందుకు తీసుకెళ్లేలా ప్రభుత్వం చేసిన మరిన్ని సంస్కరణలను ఆయన వివరించారు. రైట్ ఆఫ్ వే ప్రక్రియను సులభతరం చేయడం, స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్‌లో మార్పులు, టెలికామ్ మౌలిక సదుపాయాల రక్షణ మరియు వైర్‌లెస్ లైసెన్సింగ్ విధానాన్ని సరళీకరం చేయడం వంటి చర్యలు నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేశాయని, తద్వారా సేవల నాణ్యత పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఫలితాల ఆధారిత పాలన మరియు ప్రైవేట్ రంగ సామర్థ్యం వైపు మార్పు

టెలికామ్ శాఖలో వస్తున్న ఒక ప్రాథమిక మార్పు గురించి డాక్టర్ పెమ్మసాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ పాలనలో కూడా ప్రైవేట్ రంగంలో ఉండే పనితీరును, వేగాన్ని అలవర్చుకుంటూ, కేవలం ప్రక్రియలకే పరిమితం కాకుండా ఫలితాల ఆధారంగా పని చేసే సంస్కృతిని తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రిత్వ శాఖ ప్రస్తుతం పని వేగం, జవాబుదారీతనం మరియు పనుల అమలుపై పక్కాగా దృష్టి పెడుతోందని ఆయన చెప్పారు. టెలికామ్ సేవా సంస్థలు, స్టార్టప్‌లు, వెండర్లు, కాంట్రాక్టర్లు మరియు రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. దీనివల్ల మౌలిక సదుపాయాల కల్పన, అనుమతులు లేదా చివరి మైలు వరకు కనెక్టివిటీ అందించడంలో ఎదురయ్యే సవాళ్లను నిర్ణీత సమయంలోగా పరిష్కరించడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా రివ్యూలు చేయడం, పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం మరియు అమలు చేసే సంస్థలతో సన్నిహితంగా సమన్వయం చేసుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇది ప్రభుత్వ విధానాలకు, ఆచరణాత్మక పనితీరును జోడించిన ఒక కొత్త పాలనా నమూనా అని ఆయన వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ గురించి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. దాదాపు 35, 000 మారుమూల గ్రామాలకు 4ఉ మౌలిక సదుపాయాల ద్వారా కనెక్టివిటీని అందిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం వివిధ విభాగాల మధ్య భారీ స్థాయిలో సమన్వయం జరుగుతోందని చెప్పారు. గ్రామీణ టెలికామ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో బీఎస్ఎన్ఎల్ కీలక పాత్ర పోషించిందని, విద్యుత్ వ్యవస్థల అప్‌గ్రేడ్ చేయడం ద్వారా అనేక ప్రాంతాల్లో నెట్‌వర్క్ పనితీరును 90-95% వరకు మెరుగుపరిచామని ఆయన వెల్లడించారు.

భారత్ నెట్ ద్వారా జరుగుతున్న పురోగతిని వివరిస్తూ, సుమారు 2.6 లక్షల గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం దాదాపు 17 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతోందని ఆయన తెలిపారు. ఇది 5ఉ మరియు భవిష్యత్తులో రాబోయే 6ఉ సేవలకు బలమైన డిజిటల్ పునాదిగా మారుతుందని చెప్పారు.

భవిష్యత్తు గురించి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వచ్చే 6ఉ పేటెంట్లు మరియు ప్రమాణాలలో దాదాపు 10% వాటాను భారత్ దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని డాక్టర్ పెమ్మసాని వివరించారు. 3ఉఖఖ వంటి అంతర్జాతీయ ప్రమాణాల నిర్ణాయక సంస్థల్లో భారత్ తన వంతు సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకుడిగా ఎదగడానికే కాకుండా, టెలికామ్ రంగ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించడంలో కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాల్లో భాగస్వామ్యం వహించడం చాలా కీలకమని ఆయన నొక్కి చెప్పారు.

దక్షిణ కొరియా వంటి దేశాలను ఉదాహరణగా చూపుతూ.. టెలికామ్ ప్రమాణాల రూపకల్పనలో ముందుగానే పాల్గొనడం వల్ల శామ్సంగ్, ఎల్‌జీ వంటి కంపెనీలు ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలిచాయని ఆయన గుర్తు చేశారు. భారత్ కూడా అదే తరహా విజయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

స్టార్టప్‌లకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, నిబంధనలను సరళతరం చేయడం మరియు టెలికామ్ పరికరాల తయారీదారులకు ఇచ్చే సర్టిఫికేషన్ సమయాన్ని తగ్గించడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డాక్టర్ పెమ్మసాని పేర్కొన్నారు.

అంతేకాకుండా, సేవల నాణ్యతను పెంచడం, నెట్‌వర్క్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం మరియు 'సంచార్' వంటి కార్యక్రమాల ద్వారా టెలికామ్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంపై కూడా దృష్టి పెడుతున్నట్లు ఆయన తెలిపారు.

చివరగా, జరుగుతున్న ఈ భారీ మార్పును వివరిస్తూ.. భారతదేశం కేవలం ఒక టెలికామ్ మార్కెట్‌గానే కాకుండా, ప్రపంచానికి సరికొత్త సాంకేతికతను అందించే దేశంగాఎదిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇంజనీర్లు, స్టార్టప్‌లు, విధానకర్తలు మరియు పరిశ్రమ వర్గాల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన కొనియాడారు.

స్టార్టప్‌లు, పరిశ్రమల ప్రతినిధులు మరియు పరిశోధకులకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డాక్టర్ పెమ్మసాని మరోసారి స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయిలో పోటీపడగల టెలికామ్ మరియు సాంకేతిక కంపెనీలను నిర్మించడానికి, పట్టుదలతో మరియు వేగంతో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆయన వారిని కోరారు.

# డిండి, వట్టెంకు సమాన ఎత్తులో నీరందించాలి : పల్లా వెంకటరెడ్డి




నల్గొండ, మార్చి 21:ఏదుల రిజర్వాయర్ నుండి డిండి, పాలమూరు-రంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టులకు ఎలాంటి వివక్ష లేకుండా ఒకే లెవల్‌లో నీటిని సరఫరా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండలోని మగ్దూం భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్, కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుండి 440 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తుండగా, డిండి ప్రాజెక్ట్‌కు మాత్రం 436 మీటర్ల ఎత్తు నుండి నీటిని తీసుకునేలా నిబంధనలు విధించడం నల్లగొండ జిల్లాపై జరుగుతున్న అన్యాయమన్నారు. డిండి ప్రాజెక్టు విషయంలో నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ, కొంతమంది ఇంజినీర్లు అమసరిస్తున్న ద్వంద వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు.

దీంతో కేవలం 58 రోజుల పాటు మాత్రమే డిండి కాలువకు నీరందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. దీనివల్ల ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీల నీటికి బదులుగా కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 1, 2న ఏదుల రిజర్వాయర్ ప్రాజెక్టులను సీపీఐ బృందం సందర్శించి, ఏప్రిల్ 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిదులు, రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు పంటల రైతు భరోసాను ఒకేసారి విడుదల చేయాలని, యూరియా కొరత తీర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలో పారదర్శకంగా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నేత బొల్గురి నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఉదోని యాదగిరిరావు, సబ్బు వీరస్వామి, ఆర్.అంచదారి బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, నలవరాజు రామలింగయ్య టి.వెంకటేశ్వర్లు, తుమ్మ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక కోదాడ

## - మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నల్గొండ, మార్చి 21:మత సామరస్యానికి ప్రతీక కోదాడ అని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని శనివారం కోదాడ పట్టణ పరిధిలోని సారాంశంపేట ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు, హిందువులు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవిస్తారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముస్లిం మైనార్టీలకు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మసీదులను పునరుద్ధరించడమే కాక మౌలానాలకు వేతనాలు పెంచిన ఘనత కూడా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కొనియాడారు.

మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుసుమ వెంకటరత్నం బాబు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరి, కమిషనర్ రమాదేవి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ చీమ నరేశ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు యర్నేని వెంకటరత్నం బాబు, మహబూబ్ జానీ, జిల్లా గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ వంగవీటి రామారావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎస్కే నయీమ్, మామిడి రామారావు, కరీముల్లా, కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఇంధన భద్రత ఈ సమావేశ ప్రధాన లక్ష్యం.. అవసరమైన సంస్కరణలను రాష్ట్రాలు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు: శ్రీ మనోహర్ లాల్

న్యూఢిల్లీ, మార్చి 21:భారత్ ఎలక్ట్రిసిటీ సమ్మిట్-2026లో భాగంగా రెండో రోజున (20.03.2026) కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ అధ్యక్షతన దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ శాఖ మంత్రుల సమావేశం జరిగింది.

విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయమంత్రి శ్రీ శ్రీపాద నాయక్ సహ-అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్, పంజాబ్ గవర్నర్ శ్రీ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీ పంకజ్ అగర్వాల్.. నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ (ఎంఎన్ఆర్ఈ) కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ సారంగితో పాటు వివిధ రాష్ట్రాలు, యూటీలకు చెందిన ఇంధన శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి శ్రీ మనోహర్ లాల్ ప్రసంగిస్తూ.. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించటంలో బీఈఎస్- 2026 కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆర్థిక వృద్ధికి, మౌలిక సదుపాయాలకు విద్యుత్ అత్యంత ప్రాథమిక అవసరమని స్పష్టం చేశారు. 520 జీడబ్ల్యూకు పైగా నిర్దేశిత విద్యుత్ సామర్థ్యాన్ని చేరుకోవటం, డిస్కంల పనితీరుని మెరుగుపరచటం, భారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ కొరతను గణనీయంగా తగ్గించటం వంటి భారత విజయాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

అందుబాటు ధరల్లో నాణ్యమైన విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ చేసేందుకు కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయ ప్రయత్నాలుండాలని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఇంధన భద్రత ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ, తలసరి విద్యుత్ వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని, పునరుత్పాదక ఇంధన వాడకాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. స్వచ్ఛమైన ఇంధన వనరుగా అణుశక్తిని గుర్తిస్తూ, శాంతి చట్టాన్ని ఈ దిశగా కీలకమైన ముందడుగుగా అభివర్ణించారు.

చట్టపరమైన, పాలనాపరమైన సంస్కరణల అమలు విషయంలో రాష్ట్రాలకు కేంద్రం పూర్తి మద్దతిస్తుందని శ్రీ మనోహర్ లాల్ హామీ ఇచ్చారు.

విద్యుత్ రంగంలో సాంకేతికత, కృత్రిమ మేధ పాత్రలను శ్రీ శ్రీపాద నాయక్ వివరించారు. స్మార్ట్ మీటరింగ్ ఇందుకు ముఖ్యమైన ఉదాహరణ అని తెలిపారు. భారతదేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగం శిలాజయేతర ఇంధన వనరుల నుంచే వస్తుందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు రూపొందించిన నూతన ముసాయిదా జాతీయ విద్యుత్ విధాన ప్రాముఖ్యతను తెలిపారు.

ఇంధన భద్రతను బలోపేతం చేయటం, ముఖ్యంగా శిలాజయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచటంపై ఈ సమావేశం దృష్టి సారించింది. దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చేందుకు సమష్టి, సమన్వయ చర్యలు ముఖ్యమని విద్యుత్ శాఖ, ఎంఎన్ఆర్ఈ కార్యదర్శులు స్పష్టం చేశారు.

కీలక నివేదికల విడుదల

ఈ సమావేశం సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల వినియోగదారుల సేవా రేటింగ్స్ (సీఎస్ఆర్‌డీ), పంపిణీ సంస్థల ర్యాంకింగ్ (డీయూఆర్) నివేదికలను విడుదల చేశారు.

డిస్కంల వినియోగదారుల సేవా రేటింగ్స్ (సీఎస్ఆర్‌డీ) నివేదిక

వినియోగదారుల సేవా డిస్కంల పనితీరును సీఎస్ఆర్‌డీ అంచనా వేస్తుంది. ఇందుకోసం ఖచ్చితమైన మీటరింగ్, బిల్లింగ్, సకాలంలో సమర్థవంతంగా ఫిర్యాదుల పరిష్కారం, పారదర్శకమైన విద్యుత్ ధరల నిర్ధారణ వంటి ప్రాథమిక ప్రమాణాలను ఇది నిర్దేశిస్తుంది. వినియోగదారుల సంతృప్తిని పెంచేందుకు, వివిధ విభాగాల మధ్య పరస్పర అభ్యాసాన్ని ప్రోత్సహించటానికి సమగ్ర వ్యూహాన్ని రూపొందించటం ఈ నివేదిక లక్ష్యం. వినియోగదారుల కేంద్రీకృత సేవలను ఇది పరిశీలిస్తుంది. విద్యుత్ నిబంధనల ప్రకారం కీలక రంగాల్లో డిస్కంల పనితీరును ఇది అంచనా వేయడమే కాక, నియామాలను పాటిస్తూ, ఎలా అమలు చేస్తున్నారో పరిశీలించి, అంచనా వేస్తుంది.

నివేదిక సమాచారం, వచ్చిన స్కోర్ల ప్రకారం.. డిస్కంలకు ఏడు గ్రేడ్లు.. ఏ+, ఏ, బీ+, బీ, సీ+, సీ, డీలో ఒకటి కేటాయిస్తారు. డిస్కంల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచటానికి, సేవా నాణ్యతలో నిరంతరం మెరుగుదల కనబరిచేందుకు ఈ గ్రేడింగ్ విధానాన్ని రూపొందించారు. మొత్తం 66 డిస్కంలను అంచనా వేయగా..6 డిస్కంలు ఏ+ గ్రేడ్, 21 డిస్కంలు ఏ గ్రేడ్, 27 డిస్కంలు బీ+ గ్రేడ్‌ను సాధించాయి.

అత్యుత్తమ గ్రేడ్లు సాధిస్తున్న సంస్థల సంఖ్య పెరగటం, మెరుగైన సేవల ద్వారా అధిక సంఖ్యలో వినియోగదారులు లబ్ధి పొందటం ద్వారా డిస్కంల పనితీరు గణనీయంగా మెరుగుపడినట్లు స్పష్టమవుతోంది. దేశీయంగా సానుకూల పురోగతికి ఇది సంకేతం. మరోవైపు తక్కువ గ్రేడ్లు (సీ, డీ) పొందుతున్న డిస్కంలు, వినియోగదారుల సంఖ్య తగ్గటం.. దిగువ స్థాయిలోనూ సానుకూల మార్పును సూచిస్తుంది.

దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును డీయూఆర్ సమగ్రంగా, పక్షపాతం లేకుండా అంచనా వేస్తుంది. గత నివేదికల ముఖ్యాంశాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక.. సంప్రదాయ పనితీరు సూచికలకే పరిమితం కాకుండా బహుముఖ మూల్యాంకన విధానాన్ని అనుసరిస్తుంది. సంస్థాగత సామర్థ్యం, ఆర్థిక స్థిరత్వం, కార్యాచరణ సామర్థ్యం, సేవలందించే విధానం వంటి కీలక అంశాలు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయి. భారతదేశ దీర్ఘకాలిక ఇంధన పరివర్తన, అభివృద్ధి లక్ష్యాలకు మద్దతుగా.. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే, సమర్థవంతంగా పనిచేసే, వినియోగదారులకు ప్రాధాన్యతనిచ్చే విద్యుత్ పంపిణీ వ్యవస్థను రూపొందించటానికి డీయూఆర్ కార్యక్రమం తోడ్పడుతుంది. మొత్తం 66 విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ ఏడాది డీయూఆర్ అంచనా ప్రక్రియలో పాల్గొన్నాయి.

# జాతీయ రహదారుల కార్యకలాపాలు, నిర్వహణకు ఏఐ ఆధారిత డ్యాష్‌క్యామ్ పర్యవేక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, మార్చి 21:జాతీయ రహదారుల కార్యకలాపాలు, నిర్వహణలో పరివర్తన దిశగా ఎన్‌హెచ్ఏఐ కీలకమైన చర్య తీసుకుంది. సుమారు 40,000 కి.మీ. మేర జాతీయ రహదారి నెట్‌వర్క్‌లో ఏఐ ఆధారిత డ్యాష్‌క్యామ్ అనలిటిక్స్ సర్వీసు (డీఏఎస్)లను ఏర్పాటు చేయనుంది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్-వేల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సమాచార ఆధారిత కార్యకలాపాలు, నిర్వహణ (ఓ అండ్ ఎం)ను మెరుగుపరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్)లను ఈ కార్యక్రమం వినియోగించుకుంటుంది.

అధిక రిజల్యూషన్ ఉన్న చిత్రాలు, వీడియోలను ఉపయోగించుకొని రిమోట్ పర్యవేక్షణను మెరుగుపరచడం, రోడ్డు పరిస్థితులను అంచనా వేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. రూట్ పెట్రోల్ వాహనాలకు (ఆర్‌పీవీలు) ప్రత్యేక డ్యాష్‌బోర్డు కెమెరాలను అమర్చి అన్ని మార్గాల్లోనూ ప్రతి వారం సమగ్ర సర్వే నిర్వహిస్తారు. 30 రకాలకు పైగా లోపాలను, క్రమరహితంగా ఉన్న వాటిని గుర్తించడానికి అధునాతన ఏఐ/ఎంఎల్ శిక్షణ పొందిన విధానాలను ఉపయోగిస్తారు.

ముఖ్యంగా రోడ్డుపై గుంతలు, కుంగిపోవడం, తీవ్రమైన పగుళ్లను గుర్తించడంతో సహా రహదారుల పరిస్థితులపై ప్రధాన దృష్టి సారిస్తారు. పాడయిన లేదా వెలసిపోయిన లేన్ మార్కింగులు, క్రాష్ బ్యారియర్లు, పని చేయని వీధి దీపాల వంటి వాటిని ఎప్పటికప్పుడు గుర్తిస్తుంది. అక్రమంగా తెరచిన డివైడర్లు, అనధికార సూచిక బోర్డులు, అక్రమ పార్కింగులు, ఆక్రమణలను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రత, ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది.

రోడ్డు సూచికలు, పేవ్‌మెంట్ మార్కింగులు, రోడ్డు స్టడ్‌లు, జాతీయ రహదారిపై లైట్లను పర్యవేక్షించి రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు నెలకు కనీసం ఒక వారాంతపు సర్వేను రాత్రి వేళల్లో నిర్వహిస్తారు. నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ మూతలు లేకపోవడం, పిచ్చిమొక్కలు పెరగడం, బస్‌బేల పరిస్థితి లాంటి ఇతర కీలకమైన నిర్వహణాంశాలను కూడా పరిశీలిస్తారు.

నివేదికల వ్యవస్థీకృత పర్యవేక్షణకు దేశవ్యాప్తంగా అయిదు వ్యూహాత్మక జోన్లను ఏర్పాటు చేశారు.


ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,
తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో..
స్నేహం! ప్రేమ!! సేవ!!!

వసుంధర విజ్ఞాన వికాస మండలి (వివివిఎం)
(సామాజిక, సాంస్కృతిక చైతన్య వేదిక)
స్థాపితం -1993 రి.నెం-4393/96

వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్
హైదరాబాద్

33 ANNIVERSARY
33వ వార్షికోత్సవము

కర్ర ముత్తారెడ్డి స్మారక జాతీయ కవితా పురస్కారాల ప్రదానం
చంద్రమోహన్ స్మారక విద్యా పురస్కారాల ప్రదానం
కోలరాజు సుప్రీం సూపర్ డాడీ పురస్కారాల ప్రదానం
జాతీయ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

తేది: 26.03.2026 (గురువారం),
సమయం: మ.1.30 గం॥ల నుండి రా. 10.00 గం॥ల వరకు
వేదిక: రవీంద్రభారతి, సమావేశ మందిరం

ముఖ్య అతిథులు : డా.ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్. గారు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
డా. నామోజు బాలాచారి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
గౌరవ అతిథులు : శ్రీ కోరుకంటి చందర్ గారు, మాజీ ఎమ్మెల్యే, రామగుండం
శ్రీ దేవసపల్లి చక్రపాణి గారు, కార్పొరేటర్, రామగుండం
విశిష్ట అతిథులు : శ్రీ నాళేశ్వరం శంకరం గారు, అధ్యక్షులు తెరసం
శ్రీ బింగి నరేందర్ గౌడ్ గారు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో ఆర్డినేటర్
శ్రీ గూడూరి స్వామిరెడ్డి గారు, జీకే రైతుమిత్రసమితి అధ్యక్షులు
సభాధ్యక్షులు : శ్రీ మధుకర్ వైద్యుల గారు, వ్యవస్థాపకులు
ప్రత్యేక ఆహ్వానితులు : రచ్చ రవి గారు, ప్రముఖ నటులు
జానులిరి గారు, ప్రముఖ నృత్యకారిణి
ఆత్మీయ అతిథులు: శ్రీ కోట్ల వెంకటేశ్వర రెడ్డి గారు, కాళోజీ పురస్కార గ్రహీత
శ్రీ బైస దేవదాసు గారు, నేటినిజం పత్రిక సంపాదకులు
శ్రీ బొమ్మగంటి శ్రావణ్ కుమార్ గారు, ఈ వార్తలు దినపత్రిక సంపాదకులు
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీ కర్ర శ్రీధర్ రెడ్డి గారు, కర్ర ముత్తారెడ్డి స్మారక ట్రస్ట్
శ్రీ కోట మాధురి గారు, కోల రాజు స్మారక ట్రస్ట్
శ్రీ బామండ్ల పల్లి రమేష్ గారు, చంద్రమోహన్ స్మారక ట్రస్ట్
సమన్వయం : బద్దిపడగ రమేష్, కట్కూరి శంకర్, దేవి లక్ష్మి నరసయ్య, కొత్త రాజేష్
వ్యాఖ్యతలు : రమాదేవి కులకర్ణి, స్రవంతి, RJ కావ్య, కావ్యశ్రీ, దుర్గాభవానీ

ఆహ్వానించువారు :
గుడికందుల భూమయ్య, ఇరుమళ్ల సుమలత, బాపురావు, లీల,అందెం శ్రీనివాస రెడ్డి, గోలి వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మణ్
అందరూ ఆహ్వానితులే...

# జానపద సినీ కథా నాయకుడు కాంతారావు



తెలుగు సినీ రంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజు ల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జాన పద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు.

తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతా రావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నార దుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరిం చింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు".

తెలంగాణ లోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగు వేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘి క, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దో షి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమా ల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయకుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొన గాడు' సినిమాలు తీశారు.

రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భా లలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వర రావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు.

ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరిం చింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పిం చాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు.

**కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతా రావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం.**

కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969); గండర గండడు (1969); ప్రేమ జీవులు (1971); గుండెలు తీసిన మొనగాడు (1974); స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగా ణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కో వాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు.

ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టు కున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరా బాద్ చేరారు.

చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతం గా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు.

అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు.

ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు.

సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతా రావు, తన 85వ ఏట, 2009 మార్చి 22న క్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

మార్చి 22.. కత్తి కాంతారావు వర్ధంతి



**-రామ కిష్టయ్య**
**సంగన భట్ల,**
9440595494

# ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
## -ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం (ప్రతినిధి): :వేములవాడ పట్టణంలో రంజాన్ పర్వదినం సందర్భంగా వేడుకలు ఘనంగా



నిర్వహించారు. ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేశారు. రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ పవిత్ర మాసం త్యాగం, సహనం, దయ, సమానత్వాన్ని ప్రతి బింబిస్తుందని పేర్కొన్నారు .తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింల కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు. అల్లాహ్ ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. వేములవాడలో ముస్లిం సోదరులు దశాబ్దంగా ఎదురు చూస్తున్న షాదీ ఖానా నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే ఆ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవన బీమా అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రత్యేక బీమా వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.

# లారీలో టపాకాయల పేలుళ్లతో భారీగా మంటలు..

హైదరాబాద్, మార్చి 21:టపాసుల లోడ్‌తో వెళ్తున్న లారీ కరెంట్ వైర్లు తగలడంతో దగ్ధమైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పరిధిలో చోటు చేసుకుంది. టపాసులను తీసుకెళ్తున్న లారీ పెంజెర్ల సమీపంలోకి రాగానే పైన ఉన్న కరెంట్ వైర్లు తగిలాయి. లారీలో పేలుడు పదార్థాలుండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

ప్రమాదం ధాటికి లారీలో ఉన్న టపాసులు పేలుతూ భారీ శబ్దాలతో పెద్ద ఎత్తు మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. టపాకాయల శబ్దాలతో పరిసర ప్రాంతమంతా దద్దరిల్లిపోయిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

# భీమన్నకు ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం ప్రతినిధి): వేములవాడ భీమేశ్వర స్వామిని శనివారం మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈఓ రమాదేవి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టడం, ఆలయ పరిసరాల్లో గస్తీ పెంచడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు శ్రీనివాస్, నాగేంద్రచారి, ఇతర పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

## -ఈద్గా, మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
## - ముస్లిం సోదరులకు పలువురి శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం జిల్లాలోని



అన్ని ఈద్గా మైదానాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి. పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ నెల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని తగ్గించుకుని, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ మనుషులలో దయ, సహానుభూతి, సహకార భావాలను పెంపొందిస్తుందని తెలిపారు. రంజాన్ సందర్భంగా మానవ జన్మ సార్థకతను ఇతరులకు సహాయం చేయడంలోనే ఉందని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు తదితర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు ముస్లింలు తమ విందు వంటకాలను హిందూ సోదరులతో పంచుకుని పరమత సహనాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువత, ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈద్గా వద్ద అదనపు ఎస్పీ చంద్రయ్య ఏర్పాట్ల పరిశీలన



రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం (ప్రతినిధి): వేములవాడలో ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు. వేములవాడ ఈద్గా వద్ద జరుగుతున్న ప్రార్థనలు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య స్వయంగా పరిశీలించారు. ఈద్గా వద్ద ప్రార్థనలకు ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగ జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాస్, సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు ఉన్నారు.

# ఉత్తమ్ నగర్‌లో ప్రార్థనల తర్వాత పోలీసులపై ముస్లింల పూలవర్షం

న్యూఢిల్లీ, మార్చి 21:న్యూఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం ఉంది. శనివారం ఉదయం ప్రార్థనల తర్వాత ముస్లింలు పోలీసులపై పూలవర్షం కురిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసలు అక్కడ రంజాన్ వేడుకలు జరుగుతాయా, లేదా అనే సందేహాలు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు, సైనిక బలగాల భద్రత మధ్య రంజాన్ వేడుకలు జరిగాయి.

ఇటీవల హోలీ సందర్భంగా న్యూఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌లో తరుణ్ అనే యువకుడిని కొందరు హత్య చేసిన సంగతి తెలిసిందే. చిన్న ఘర్షణ యువకుడి హత్యకు దారితీసింది. ఈ ఘటనతో ఉత్తమ్ నగర్‌లో కొద్ది రోజులుగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా పలువురు హిందువులు, హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హత్యకు ప్రతిగా ఈద్ వేడుకల్ని అడ్డుకుంటామని కొందరు హెచ్చరించారు. ఈ వార్నింగ్స్ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగింది. రంజాన్ వేడుకలు ఎలా జరుగుతాయో అనే సందేహాలు మొదలయ్యాయి.

# ముస్లింలతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస రంజాన్ కలయిక



రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం (ప్రతినిధి): ముస్లింల పవిత్ర పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం వేములవాడ పట్టణంలోని ముస్లిం ప్రముఖుల ఇళ్లను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నివసించే ప్రతి పౌరుడు అన్ని మతాల పట్ల సోదరభావంతో జీవించాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ అల్లా దీవెనలతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు తుమ్మ మధు, తోట రాజు, సిరిగిరి సంగీత శ్రీకాంత్, రామతీర్థపు హరీష్, కృష్ణవేణి, బాలకృష్ణ, ఇప్పపుల అజయ్, కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న భక్తులకు పటిష్టవంతమైన భద్రత : ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, మార్చి 21: నేటినిజం (ప్రతినిధి): దేశ నలుమూలల నుంచి వచ్చే రాజన్న భక్తులకు పటిష్టవంతమైన భద్రత కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని మల్టీ జోన్ -1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వేములవాడలోని భీమేశ్వర స్వామి ఆలయం సందర్శనం సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలను ఈవో రమాదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com